Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 | సంచిక : 321 | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 10 డిసెంబర్ 2023 | ఆదివారం | పేజీలు : 4

### జనవరి 16 నుంచి అయోధ్యలో ఆలయ ప్రతిష్ఠ పూజలు

అయోధ్య : అయోధ్య రామ మందిరంలో జనవరి 22న ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలో రామ లల్లా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ జరగడానికి ముందు నిర్వహించే పలు పూజల వివరాలను నిర్వాహకులు వెల్లడించారు. జనవరి 16 నుంచి ప్రాథమిక పూజలు ప్రారంభమవుతాయి. ఆ రోజున ఆచార్య లక్ష్మీకాంత్ మథురానాథ్ దీక్షిత్ ఆధ్వర్యంలో వేద పండితులు సర్వప్రాయశ్చిత్త హెూమం చేస్తారు. సరయూ నదిలో దశవిధ స్నానాల అనంతరం కార్యక్రమ యజమానిగా బాధ్యతలు చేపడతారు. 17న జలయాత్ర, తీర్థయాత్ర, కలశ పూజ, కలశ యాత్రలు జరుగుతాయి. 18 నుంచి ప్రధాన పూజలు ప్రారంభమవుతాయి. 19న రోజంతా పలు పూజలు నిర్వహిస్తారు. దేవత పూజ, అన్ని శాఖల వేద పఠనం, అధివాసన పూజ, కుండ పూజ, అగ్ని మథనం, జలాధివాసం ఇతర పూజలు ఉంటాయి.

# 100 రోజుల్లో ఆరు గ్యారంటీలు

## ఇచ్చిన మాట ప్రకారం అమలు చేసి తీరుతాం

### మహాలక్ష్మీ పథకం, రాజీవ్ ఆరోగ్యశ్రీ చేయూత ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి





హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీల అమలుకు శ్రీకారం చుట్టింది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం స్కీమ్ మహాలక్ష్మి పథకాన్ని , అలాగే రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా 10 లక్షల రూపాయల చేయూత పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అసెంబ్లీ వద్ద సీఎం రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, మహిళా మంత్రులు సీతక్క, కొండా సురేఖ లతోపాటు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, ఇతర మంత్రులు, సిఎస్ శాంతికుమారి సమక్షంలో రాజీవ్ ఆరోగ్యశ్రీలో పదిలక్షల రూపాయల చేయూతను ప్రారంభించడంతో పాటు, స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ జెండా ఊపగా మహాలక్ష్మీ పథకంలో భాగంగా ఉచిత బస్సులను ప్రారంభించారు.

ఇకపై రాష్ట్రంలోని మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించడానికి ఈ పథకం ద్వారా వీలు కలుగుతుంది. అలాగే రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా నిరుపేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందుతుంది. రాజీవ్ ఆరోగ్యశ్రీ ఎంప్యానల్ ఉన్న ఆసుపత్రులలో నిరుపేదలకు పదిలక్షల రూపాయల వరకు కార్పొరేట్ వైద్య సహాయం అందనుంది. ఈ రెండు పథకాలను ప్రారంభించిన క్రమంలో మాట్లాడిన రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చి, తెలంగాణ రాష్ట్ర సాకారం కోసం కృషి చేసిన ఉక్కుమనిషి సోనియాగాంధీ పుట్టినరోజు బహుమతిగా దీనిని అభివర్ణించారు. ఇచ్చిన మాటను నెరవేర్చి, మహిళా లోకానికి ఆదర్శంగా నిలబడ్డ మాతృమూర్తి సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా రెండు హామీలను నెరవేరుస్తున్నామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ప్రయాణం ఉచితం చేయడంతో పాటు, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా 10 లక్షల సహాయం అందిస్తున్నట్టు ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి వెల్లడించారు. ప్రభుత్వం ఈ రాష్ట్రంలో ఉన్న పేదలు నిరుపేదలను దృష్టిలో పెట్టుకొని ఆరు హామీలను ఇచ్చి, నెరవేరుస్తామని మాట ఇవ్వడం జరిగింది.

తాము ఇచ్చిన హామీలను వంద రోజుల్లోగా నెరవేరుస్తామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సులో ఆడపిల్లలకు ఉచిత ప్రయాణాన్ని లాంచనంగా ఈరోజు ప్రారంభిస్తున్న మహిళా మంత్రులు, మహిళా శాసనసభ్యులతో పాటు, తాము కూడా ప్రయాణం చేసి ట్యాంక్ బండ్ మీద ఉన్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్లి ఆయనకు నివాళులర్పించి , తిరిగి శాసనసభకు వచ్చి మిగతా కార్యక్రమాలలో పాల్గొంటామని రేవంత్ రెడ్డి తెలిపారు.

ఏ విధంగా అయితే తెలంగాణ ఇస్తామని సోనియాగాంధీ గ్యారెంటీ ఇచ్చి తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారో, అదేవిధంగా తామిచ్చిన గ్యారెంటీ లను అమలు చేసి అభివృద్ధి రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడానికి కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తుందన్నారు. ఆ మాట కోసం అహర్నిశలు కృషి చేస్తామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.




హైదరాబాద్: తెలంగాణలో ఎన్నికల హామీల్లో భాగంగా మహాలక్ష్మి పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఈరోజు ప్రారంభించారు. అసెంబ్లీ వద్ద ఆర్టీసీ బస్సుల్లో మహిళలు, యువతులు ఉచితంగా ప్రయాణించే మహాలక్ష్మి పథకాన్ని సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క లాంఛనంగా ప్రారంభించారు. అలాగే, రాజీవ్ ఆరోగ్యశ్రీ(చేయూత)ని ప్రారంభించిన సీఎం, మంత్రులు. దీంతో, ఈరోజు మధ్యాహ్నాం రెండు గంటల నుంచి మహాలక్ష్మి పథకం అమలులోకి రానుంది. తెలంగాణలో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు. అసెంబ్లీ ఆవరణలో మూడు బస్సులు ప్రారంభమయ్యాయి. ఇక, ఆరోగ్యశ్రీ కింద రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వైద్యఖర్చులను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయ తీసుకుంది. మంత్రులు సీతక్క, కొండా సురేఖ పచ్చజెండాను ఊపి బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. నేడు సోనియా గాంధీ పుట్టినరోజు. డిసెంబర్ 9 తెలంగాణకు పండుగ రోజు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను సోనియా నెరవేర్చారు. నాది తెలంగాణ అని చెప్పుకునే అవకాశాన్ని సోనియా మనకు ఇచ్చారు. మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించాం. తెలంగాణవ్యాప్తంగా మహాలక్ష్మీ పథకం అమలులోకి వస్తుంది. ఆరు గ్యారంటీల్లో భాగంగా రెండు గ్యారంటీలను అమలుచేస్తున్నాం అని అన్నారు. అసెంబ్లీ నుంచి కాంగ్రెస్ మంత్రులు, మహిళ నేతలు బస్సులో ట్యాంక్ బండ్‌కు బయలుదేరారు. దీంతో, అక్కడ సందడి వాతావరణం చోటుచేసుకుంది.




హైదరాబాద్: కాంగ్రెస్, మజ్లిస్ పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. అందులో భాగంగానే ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్ ఒవైసీని చేశారన్నారు. సీనియర్ ఎమ్మెల్యేలను కాదని ఏ ప్రాతిపదికన ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్‌ను చేశారని ప్రశ్నించారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు ఆయన మాట్లాడారు. "ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ప్రజలు భాజపాను ఆదరించారు. ఒక్క స్థానం నుంచి 8 సీట్లకు పెరిగాం. 6 నుంచి 14 శాతానికి మా ఓటు బ్యాంకు పెరిగింది. కాంగ్రెస్ పార్టీ తన పాత అలవాటు ప్రకారం శాసనసభ గౌరవాన్ని కాల రాసింది. మజ్లిస్‌తో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఆ పార్టీ వ్యక్తిని ప్రొటెం స్పీకర్‌ను చేసింది. అక్బరుద్దీన్ ఓవైసీని ప్రొటెం స్పీకర్ చేయడాన్ని భాజపా వ్యతిరేకిస్తుంది. అనేక మంది సీనియర్ ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ అక్బరుద్దీన్‌ను ప్రొటెం స్పీకర్‌ను చేశారు. ప్రొటెం స్పీకర్ సమక్షంలో భాజపా ఎమ్మెల్యేలు ఇవాళ ప్రమాణ స్వీకారం చేయరు. ఈ అంశంపై గవర్నర్‌కు కూడా ఫిర్యాదు చేస్తాం. స్పీకర్ ఎన్నికను ఆపాలని డిమాండ్ చేస్తున్నాం. రెగ్యులర్ స్పీకర్ ఎన్నిక తరువాతే భాజపా ఎమ్మెల్యేలు ప్రమాణం చేస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మినా.. దగ్గినా పడిపోతుంది అందుకే మజ్లిస్‌ను మచ్చిక చేసుకునే ప్రయత్నం చేస్తోంది" అని కిషన్ రెడ్డి విమర్శించారు.




### కాలికి ఆపరేషన్.. నడవలేని స్థితిలో కేసీఆర్

హైదరాబాద్: తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్‌కు తీవ్ర గాయమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కేసీఆర్ ఎడమ కాలికి యశోద ఆసుపత్రి వైద్యులు నిన్న హిప్ రిప్లేస్‌మెంట్ చేశారు. దీంతో, ఆయనకు దాదాపు ఎనిమిది వారాల విశ్రాంతి అవసరమని వైద్యులు తెలిపారు. మరోవైపు.. ఆపరేషన్ అనంతరం కేసీఆర్ ఆసుపత్రిలోనే విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇక, కాలికి ఆపరేషన్ తర్వాత.. నడవడానికి కేసీఆర్ తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వైద్యులు కేసీఆర్ దగ్గరే ఉండి.. వాకర్ సాయంతో ఆయనను నడిపించే ప్రయత్నం చేస్తున్నారు. కాగా, దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియోపై నటుడు ప్రకాశ్‌రాజ్ స్పందించారు. కేసీఆర్‌ను మైక్ రాక్‌స్టార్ అంటూ కామెంట్స్ చేస్తూ వీడియోను ట్విట్టర్‌లో షేర్ చేశారు. ఇదిలా ఉండగా.. ఆపరేషన్ అనంతరం కేసీఆర్ ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్టు వైద్యులు తెలిపారు.




# కొత్త మంత్రులు వీరే

## శాఖల కేటాయింపు

తెలంగాణ ప్రజల ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా ఏర్పడిన కొత్త ప్రభుత్వం పూర్తి మంత్రి వర్గంతో ఈ రోజు (డిసెంబర్ 09) నుంచే కొలువు దీరింది. దీనికి సంబంధించి గతంలో సూచన ప్రాయంగా కేటాయించిన శాఖలను ఇప్పుడు పూర్తి స్థాయిలో కేటాయించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారికంగా శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. సీఎం సమక్షంలో ఈ రోజు కొత్త మంత్రులు ప్రమాణ స్వీకార కార్యక్రమం కొనసాగింది.

ఉదయం నుంచి మధ్యాహ్నాం వరకు ప్రమాణ స్వీకారం జరిగింది. ఆ తర్వాత శాసనసభ సమావేశం కూడా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ప్రొటెం స్పీకర్ గా మజ్లిస్ పార్టీ నుంచి అక్బరొద్దీన్ ఒవైసీ కూడా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే మంత్రుల ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ దూరంగా ఉంది. మజ్లిస్ కు ప్రొటెం స్పీకర్ అవకాశం ఇచ్చినందుకు దూరంగా ఉంటున్నట్లు బీజేపీ ప్రకటించింది. తెలంగాణ శాసన సభ స్పీకర్ గా గడ్డం ప్రసాద్ కుమార్ ను ఇప్పటికే ఎన్నుకున్నా రు. వికారాబాద్ నియోజకవర్గం నుంచి గడ్డం గెలుపొందారు. వివాద రహితుడిగా, సౌమ్యుడిగా, వీటితో పాటు దళితుడిగా ప్రసాద్ కుమార్ కు గుర్తింపు ఉంది. కిరణ్ కుమార్ రెడ్డి మంత్రి వర్గంలో కూడా ఆయన పని చేశారు. జౌళి శాఖను ఆయన పర్యవేక్షించారు.

**తెలంగాణ మంత్రులు.. కేటాయించిన శాఖల వివరాలు..**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్ద మున్సిపల్, అర్బన్ డెవలప్‌మెంట్, జనరల్ అడ్మినిస్ట్రేషన్, హెూంశాఖలను ఉంచుకోనున్నారు. భట్టి విక్రమార్కకు ఆర్థిక శాఖ, ప్లానింగ్, విద్యుత్ శాఖ, ఇందన శాఖలను కేటాయించారు.**

**దామోదర రాజనర్సింహా - ఆరోగ్యం, ఫ్యామిలీ వెల్ఫేర్, సైన్స్ అండ్ టెక్నాలజీ,**
**కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి - ఆర్ అండ్ బీ, సినిమాటోగ్రఫీ,**
**ఉత్తమ్ కుమార్ రెడ్డి - పౌర సరఫరాలు, ఇరిగేషన్ శాఖ,**
**పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి - సమాచార శాఖ, రెవెన్యూ అండ్ హౌసింగ్,**
**దుద్దిళ్ల శ్రీధర్ బాబు - ఐటీ, అసెంబ్లీ వ్యవహారాల శాఖ,**
**పొన్నం ప్రభాకర్ గౌడ్ - రవాణా శాఖ, బీసీ వెల్ఫేర్,**
**దనసరి అనసూయ (సీతక్క) - పంచాయతీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ,**
**కొండా సురేఖ - అటవీ, దేవాదాయ శాఖ,**
**తుమ్మల నాగేశ్వర రావు - వ్యవసాయ, టెక్స్‌టైల్స్ శాఖ,**
**జూపల్లి కృష్ణారావు - ఎక్సైజ్, పర్యాటక శాఖలను కేటాయించారు.**

వారి వారి అర్హతలను బట్టి శాఖలను కేటాయించినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ రోజు నుంచే ఆయా శాఖలకు సంబంధించి పూర్తి అధికారాలు అప్పగించినట్లు సీఎం ప్రకటించారు. అనంతరం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాగా.. ముందుగా రేవంత్ రెడ్డి అసెంబ్లీ ఆవరణలో ఉన్న బంగారు మైసమ్మ ఆలయంలో పూజలు చేసి అసెంబ్లీలో అడుగు పెట్టారు. ఈ రోజు సమావేశాలకు ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్, కేటీఆర్ గైర్హాజరవుతున్నారు. కేసీఆర్ అనారోగ్యం భారిన పడడంతో హాస్పిటల్ లో శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. ఆయన వద్ద ఉన్న కేటీఆర్ కూడా సమావేశాలకు హాజరుకాలేకపోతున్నట్లు తెలుస్తోంది.

## సంపాదకీయం

# గడిచిన ఐదేళ్లలో రూ.10.57 లక్షల కోట్ల రుణాలు మాఫీ!

భారతదేశం ఇప్పటికీ అభివృద్ధి చెందుతున్న దేశంగానే ఎందుకు ఉంది? ఈ ప్రశ్నకు ఎన్ని సమాధానాలున్నప్పటికీ... ఒక సమాధానం మాత్రం రెగ్యులర్ గా వినిపిస్తుంటుంది. ధనవంతుడికి ఒకరూలు, పేదవాడికి మరోరూల్ కొన్ని విషయాల్లో అప్లై అవుతుంటుందని.. ప్రధానంగా బ్యాంక్ రుణాల ఎగవేత, రుణాల మాఫీ వంటి విషయాల్లో ఇదీ భారీగా వినిపిస్తుంటుందని చెబుతుంటారు. ఆ సంగతి అలా ఉంటే... తాజాగా గడిచిన ఐదేళ్లలో 10.57 లక్షల కోట్లు రైటాఫ్ చేసినట్లు కేంద్రం తెలిపిన విషయం ఇప్పుడు చర్చ నీయాంశం అయ్యింది. గడిచిన ఐదేళ్లలో షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకులు (ఎస్.సి.బి) దాదాపు రూ. 10.6 లక్షల కోట్లను మాఫీ చేశాయని, ఇందులో రూ. 5.52 లక్షల కోట్లు భారీ పరిశ్రమలకు చెందినవేనని రాజ్యసభలో ఓ ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగవత్ కరద్ సమాధానమిచ్చారు. "రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)" వివరాల ప్రకారం దేశంలోని షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకులు గత ఐదు ఆర్థిక సంవత్సరాల్లో రూ. 10.57 లక్షల కోట్ల రుణాలను రైటాఫ్ చేశాయి" అని ఆయన వివరించారు. ఆర్బీఐ చట్టాన్ని ఉటంకిస్తూ ఖాతాలు రద్దు చేయబడిన వ్యక్తిగత రుణగ్రహీతల పేర్లను మంత్రి వెల్లడించలేదు కానీ... దాదాపు 2,300 మంది రుణగ్రహీతలు, ఒక్కొక్కరు రూ. 5 కోట్ల కంటే ఎక్కువ రుణాలు కలిగి ఉన్నారని, ఉద్దేశపూర్వకంగా సుమారు రూ. 2 లక్షల కోట్లను ఎగ్గొట్టారని తెలిపారు! అయితే ఇటువంటి రైటాఫ్ ల వల్ల రుణగ్రహీతలు తిరిగి చెల్లించాల్సిన బాధ్యతలు మాఫీ చేయబడవని ఆర్థిక మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి భగవత్ కరద్ వ్రాతపూర్వకంగా తెలిపారు! అదేవిధంగా 2022-23 ఆర్థిక సంవత్సరంలో అన్ని షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకులు సమిష్టిగా రూ. 5,309.80 కోట్లను అపరాధ రుసుములుగా వసూలు చేశాయని, వీటిలో రుణ చెల్లింపులో జాప్యానికి సంబంధించిన జరిమానాలు కూడా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఇదే సమయంలో సెంట్రల్ రిపోజిటరీ ఆఫ్ ఇన్ఫర్మేషన్ ఆన్ లార్జ్ క్రెడిట్స్ డేటాబేస్ లో నివేదించినట్లుగా... 31 మార్చి 2023 నాటికి మొత్తం 2,623 మంది ప్రత్యేక రుణగ్రహీతలు ఉద్దేశపూర్వక ఎగవేతదారులుగా వర్గీకరించబడ్డారని తెలిపారు. మరోపక్క మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తీసుకున్న చర్యలతో ప్రభుత్వ రంగ బ్యాంకులకు డిశెంబర్ 1 నాటికి రూ. 15,184 కోట్లు వచ్చాయని.. ఉద్దేశపూర్వక రుణ ఎగవేతదారులపై నమోదైన కేసుల్లో వారి ఆస్తులను ఈడీ జప్తు చేసిందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈ ఏడాది మార్చి ఆఖరు నాటికి 13,978 రుణ ఖాతాలపై రికవరీ కోసం లీగల్ సూట్స్ దాఖలయ్యాయని అన్నారు.

# సోనియా గాంధీ జన్మదినం పురస్కరించుకొని రాష్ట్ర మహిళాలందరికి అద్భుత కానుక..

ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు ముందే...
తోటకూర వజ్రేష్ యాదవ్



శామీర్పేట (గరుడ వార్త) : శామీర్ పేట్ మండలం మండలంలో ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు సోనియా గాంధీ జన్మదినం పురస్కరించుకొని రాష్ట్ర మహిళా అందరికీ అద్భుత కానుకగా ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ టిపిసిసి ఉపాధ్యక్షుడు మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ ధన్యవాదాలు తెలిపారు. శనివారం తూముకుంటలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలను తోటకూర వజ్రేష్ యాదవ్, నక్క ప్రభాకర్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తమ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలు 100 రోజులు అమలు చేస్తామని చెప్పి, కేవలం రెండు రోజే రెండు పథకాలు అమల్లోకి తీసుకువచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే చెందుతుందని అన్నారు. ఆరోగ్యశ్రీ పథకంలో బాగంగా నిరుపేదలకు 10 లక్షల రూపాయల్లో మేర వైద్య సౌకర్యాన్ని పొందే అవకాశాన్ని కల్పిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. ఈ పథకం మధ్యతరగతి కుటుంబాలకు కొండంత అండనిస్తుందని అన్నారు. మిగిలిన గ్యారంటీ పథకాలను కూడా రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ వీలైనంత త్వరలో అమలు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం ఏ బ్లాక్ అధ్యక్షులు, మండల మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, వైస్ ఎంపీపీ, సర్పంచులు, మాజీ సర్పంచ్ ఎద్దు నగేష్ యాదవ్, ప్రస్తుత కౌన్సిలర్లు ఎద్దు లక్ష్మి, నాగేష్ సింగిరెడ్డి, మధుసూదన్ రెడ్డి, రాజ్పుత్ సింగ్, తూముకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీముడి జైపాల్ రెడ్డి, ప్రచార కమిటీ చైర్మన్ చిర్రబోయిన రామచందర్ యాదవ్, కాంగ్రెస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్క అరుహులు సద్వినియోగం చేసుకోవాలి...

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్



జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) : రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సూచించారు. శనివారం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా శామీర్పేట్ మండల కేంద్రంలోని ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రమునందు ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 10 లక్షలకు కార్యక్రమాన్ని జిల్లాలో ప్రారంభించిన అనంతరం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని సైతం జిల్లా కలెక్టర్ గౌతం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో రూ. 5 లక్షలు ఉన్న ఆరోగ్యశ్రీ పరిమితిని ప్రస్తుతం రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ. 10 లక్షలకు పెంచడం జరిగిందని తెలిపారు. ఈ పథకం కింద ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు కార్పొరేట్ స్థాయి ఆసుపత్రుల్లో రూ. 10 లక్షల వరకు ఉచిత వైద్య సౌకర్యం కల్పించడం జరుగుతుందని కలెక్టర్ గౌతమ్ వివరించారు. ఈ సందర్భంగా ఆరోగ్యశ్రీ పథకంకు సంబంధించిన పోస్టర్ను ఆవిష్కరించారు. అనంతరం ఆరోగ్య కేంద్రం వద్ద రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన మహాలక్ష్మీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కలెక్టర్ గౌతమ్ జెండా ఊపి ప్రారంభించి అదే బస్సు లో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డితో కలిసి ప్రయాణించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర మహిళలందరికి వయస్సుతో సంబంధం లేకుండా బాలికలు, మహిళలు, ట్రాన్స్ జెండర్లు ఆర్టీసీ పల్లె వెలుగు, ఎక్స్ప్రెస్సుల్లో రాష్ట్ర సరిహద్దు వరకు ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణం చేయవచ్చని తెలిపారు. దీంతో పాటు మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం జీరో చార్జీ టికెట్ అందించడం జరుగుతుందని.. ఇది మహిళా సాధికారతకు దోహదపడడంతో పాటు ఆర్టీసి బస్సులో ప్రయాణం వల్ల మహిళలకు రక్షణ ఉంటుందని కలెక్టర్ గౌతమ్ అన్నారు. ఈ కార్యక్రమాల్లో మహిళలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సోనియా గాంధీ జన్మదినం మహిళలకు, పేదలకు వరం...కాంగ్రెస్ రెండు హామీల అమలు అందుకు నిదర్శనం.తుంకి స్వామి



శామీర్పేట (గరుడ వార్త) : యూపిఎ చైర్ పర్సన్ సోనియా గాంధీ జన్మదినం మహిళలకు, పేదలకు వరమని అందుకు నిదర్శనం కాంగ్రెస్ రెండు హామీల అమలేనని మండల కాంగ్రెస్ కమిటీ సీనియర్ నాయకుడు తుంకి స్వామి అన్నారు. ఈ సందర్భంగా శనివారం మండల కాంగ్రెస్ కమిటీ సీనియర్ నాయకుడు తుంకి స్వామి మజీద్ పూర్ లో ఆయన మాట్లాడుతూ.. సోనియా గాంధీ రాష్ట్రానికి ఏంటో మేలు చేసారన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన 6 గ్యారంటీల్లో రెండు గ్యారెంటీలు శనివారం అమలు చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేసి వారికి ధన్యవాదాలు తెలిపారు.

# ఘనంగా సోనియాగాంధీ పుట్టినరోజు వేడుకలు

## మాట నిలబెట్టుకుంటున్నాం : మహాలక్ష్మి స్కీమ్ ప్రారంభించిన నాయకులు



రేగోడ్:-రేగోడు మండల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం నాడు కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ 77వ జన్మదినాన్ని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా కేక్ కట్ చేసి ఒకరినొకరు తినిపించుకొని సంబరాలు చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడు తూ తెలంగాణ రాష్ట్ర సాకారం కోసం కృషి చేసిన సోనియాగాంధీ పుట్టినరోజు బహుమతిగా ఇచ్చిన మాటను నెరవేర్చి, మహిళా లోకానికి ఆదర్శంగా నిలబడ్డ మాతృమూర్తి సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా రెండు హామీలను ఇకపై రాష్ట్రంలోని మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించడానికి ఈ పథకం ద్వారా వీలు కలుగుతుంది. అలాగే రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా నిరుపేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందుతుంది అని అన్నారు. బస్సులో మహిళలు ఉచితం గా వెళ్లే కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు జెండా ఊపి ప్రారంభించారు.

తెలంగాణ లో సుభిక్ష పరిపాలన ప్రారంభం అయినట్లేనని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ చోటుమియా, పార్టీ ఉప అధ్యక్షుడు మల్లికార్జున్, యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ఎన్ఎస్ యూఐ అధ్యక్షుడు ఉపేందర్, పిఏసిఎస్ డైరెక్టర్ నాగేందర్ రావు, స్థానిక అధ్యక్షుడు శంకరప్ప, నాయకులు కె. నారాయణ, పుట్టి దుర్గయ్య, రామగౌడ్,ఖాజీ హమీదోద్దీన్, చిద్రే కృష్ణ, కె. మహేష్, హరీష్, ఫాజిల్, శివ కుమార్, మోహన్, వెన్నిలా రాజు, లతీఫ్, పరుశు రాం గౌడ్, రషీద్, ఎల్లరాజ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# అద్రాస్పల్లి భూముల విషయంలో తగు చర్యలు...

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) : మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలోని కీసర రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న అద్రాస్పల్లి భూముల విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందనవసరం లేదని, విషయంలో సంబంధిత ఆర్డీవో రాజేశ్ కుమార్ నేతృత్వంలో భూములకు సంబంధించి అందరికీ న్యాయం జరిగేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. శనివారం అద్రాస్పల్లి భూములపై ప్రత్యేక అధికారిగా కీసర ఆర్డీవో రాజేశ్కుమార్కు బాధ్యతలు అప్పగించి పూర్తి వివరాలతో కూడిన సమాచారాన్ని తనకు అందచేయాలని ఆదేశించారు. ఈ ప్రాంతంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములకు సంబంధించి స్థానికులెవరూ ఆందోళన చెందరాదని



తెలిపారు. అద్రాస్పల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 235లో ఉన్న పదిహేను ఎకరాల ప్రభుత్వ భూమిని ఎవరూ ఆక్రమించకుండా అవసరమైన చర్యలు చేపట్టామని అందుకు ప్రత్యేకంగా కీసర ఆర్డీవో రాజేశ్కుమార్కు బాధ్యతలు అప్పగించినట్లు వివరించారు. ఈ భూములను సర్వే చేయించడం కూడా జరుగుతుందని... కబ్జాకు పాల్పడినట్లయితే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ గౌతమ్ స్పష్టం చేశారు.

## గోన హనుమంత రెడ్డి అద్వర్యంలోఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

శామీర్పేట (గరుడ వార్త) : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీల్లో భాగంగా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని సోనియా గాంధీ జన్మదిన పురస్కరించుకొని నేడు లాంచనంగా ప్రారంభించారని ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు గోన హనుమంత రెడ్డి అన్నారు. సోనియా గాంధీ 77వ జన్మదిన పురస్కరించుకొని కొల్తూర్ గ్రామంలో ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు గోన హనుమంత రెడ్డి అద్వర్యంలో



నిర్వహించారు. సోదియాగాంధీ, రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం ఉచిత బస్ ప్రయాణంలో పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమంలో బస్ డిపో మేనేజర్ బహుభూతి, గ్రామ బస్ అధికారి గోపి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వైయస్ గౌడ్, మహేందర్ యాదవ్, రామ్ చందర్ యాదవ్ ఎద్దు నాగేష్ యాదవ్ భీమిలి జైపాల్ రెడ్డి జగదీష్ గౌతమ్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# క్రిడల్లోను సత్త చాటుతున్న దక్ష కళాశాల జాతీయస్థాయి ఖోఖో పోటీలకు దక్ష అకాడమీ విద్యార్థి ఎంపిక



శామీర్పేట (గరుడ వార్త) : దక్ష కళాశాల క్రిడల్లోను సత్త చాటుతోంది. మహారాష్ట్ర నాసిక్ లో జరుగబోవు జాతీయస్థాయి ఖోఖో క్రీడ పోటీలకు గాను షామీర్పేట్ మండల అలియాబాద్ గ్రామా పరిదిలోనున్న దక్ష అకాడమీకి విద్యార్ధి పవన్ అండర్ 19 విభాగంలో ఎంపికయ్యారని, దక్ష అకాడమీ పిటి పూరెల్లి సంతోష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ మా కళాశాల విద్యార్థి జాతీయ స్థాయిలో ఎంపిక రావడం పట్ల మండల వ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయని అన్నారు. కళాశాల కరస్పాండెంట్ శివశంకర్, ప్రిన్సిపల్ మల్లేష్ తదితరులు విద్యార్ధి పవన్ ను అభినందించారు.

## రేషన్‌కార్డుల జారీపై ఆశలు.. మళ్లీ దరఖాస్తు చేస్తున్న పేదలు

హైదరాబాద్: కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలతోపాటు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది. వీటి అమలులో లబ్ధిదారుల ఎంపికకు రేషన్‌కార్డులు కీలకం కానున్న నేపథ్యంలో కొత్త కార్డుల జారీ అంశం తెరపైకి వచ్చింది. 2014 నుంచి కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ నిలిచిపోవడం, అర్హులైన కుటుంబాల సంఖ్య పెరిగిపోవడంతో కొత్త ప్రభుత్వం ప్రక్రియ ప్రారంభిస్తుందన్న ఆశలు అర్హుల్లో చిగురిస్తున్నాయి. సన్నబియ్యం పంపిణీతోపాటు మహిళలకు రూ.2,500, ఇందిరమ్మ ఇళ్లు, విద్యార్థులకు 5లక్షల విద్యా భరోసా కార్డు, రూ.10లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా పథకాల లభిస్తాయని అనేక మంది మీసేవాల్లో కొత్తకార్డుల కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారు.



భారీగా పెండింగ్ రేషన్ కార్డుల మ్యుటేషన్లు, కొత్త కార్డుల జారీపై గత ప్రభుత్వం అనుమతులు ఇవ్వకపోవడంతో ఆ అంశం పెండింగ్‌లో పడిపోయింది. హైదరాబాద్ జిల్లాలో 6,36,698, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 7.8లక్షల మంది కార్డుదారులున్నారు. పాతకార్డుల్లో అదనంగా కుటుంబ సభ్యులను చేర్చడానికి వీలుగా పౌరసరఫరాలశాఖకు హైదరాబాద్ జిల్లాలో 1,28,205 దరఖాస్తులు అందాయి. తిరస్కరించినవీ, పరిశీలించినవి పోను 74,802 పెండింగ్‌లో ఉన్నాయి. రంగారెడ్డిలో 50వేలు, మేడ్చల్‌లో 40వేల వరకు పెండింగ్‌లో ఉన్నాయి.

రీసర్వే చేసినా..పదేళ్లలో వేర్వేరు కారణాలతో అనర్హులుగా గుర్తించిన అధికారులు మూడు జిల్లాల్లో 2.8లక్షల కార్డులు తొలగించారు. వారంతా సుప్రీం కోర్టును ఆశ్రయించారు. విచారించిన న్యాయస్థానం మరోసారి రీసర్వే చేసి అర్హులకు కార్డులు మంజూరు చేయాలంటూ గతేడాది జులైలో ఆదేశించింది. ఇంటింటి సర్వే చేపట్టిన అధికారులు ఎంత మంది లబ్ధిదారులను గుర్తించారో చెప్పలేదు. వారూ కార్డులు పునరుద్ధరిస్తారని ఆశిస్తున్నారు.

## రెవెన్యూ డివిజన్ కల సాకారమయ్యేనా..?

ఆలేరు : ఆలేరు పరిసర ప్రాంతాల ప్రజలు దశాబ్దాల కాలంగా పట్టణాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇందుకు అన్ని రాజకీయ పార్టీల మద్దతు ఉంది. ఇటీవల ఎన్నికల్లోనూ ఆలేరు రెవెన్యూ డివిజన్ ప్రధాన అంశంగా మారింది. స్థానికంగా జరిగిన ఎన్నికల బహిరంగ సభల్లో కాంగ్రెస్, భారాస ముఖ్య నేతలు కేసీఆర్, రేవంత్‌రెడ్డి, కేటీఆర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు స్పష్టమైన హామీనిచ్చారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన క్రమంలో.. ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మీడియాతో మాట్లాడారు. ఇచ్చినహామీ మేరకు ఆలేరు రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేయిస్తానని ప్రకటించారు. నియోజకవర్గంలోని యాదాద్రి ప్రపంచ స్థాయి క్షేత్రంగా అభివృద్ధి జరిగిన క్రమంలో.. ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతో ఈ ప్రాంతానికి కొత్త శోభ చేకూరుతుందని ప్రజలు ఆశిస్తున్నారు.



ఐదు మండలాలతో ప్రతిపాదనలు..

ఆలేరు రెవెన్యూ డివిజన్‌ను కోరుతూ మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత 2021 మార్చిలో ప్రభుత్వానికి లేఖను అందజేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అప్పటి జిల్లా పాలనాధికారి అనితా రాంచంద్రన్ ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు ఆవశ్యకత, భవిష్యత్తులో అభివృద్ధి తీరును వివరిస్తూ 31.5.2021న ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఆలేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోకి ఆలేరు, యాదగిరిగుట్ట, రాజపేట, మోటకొండూరు, గుండాల మండలాలను చేర్చుతూ అప్పట్లో ప్రతిపాదనలు పంపించారు. ఈ మండలాలకు ఆలేరు పట్టణం కేంద్రంగా ఉంది.

పరిపాలన సౌలభ్యం కోసం...

ప్రస్తుతం ఉన్న భువనగిరి డివిజన్‌లో 12 మండలాలు ఉండడంతో.. ప్రజలకు సంబంధించి డివిజన్ స్థాయిలో జరగాల్సిన పనుల్లో జాప్యం జరుగుతోంది. రెవెన్యూ డివిజన్‌లో ప్రతిపాదిత మండలాలు భౌగోళికంగా ఆలేరుకు సమీపంలో ఉన్నాయి. ఆలేరు పట్టణం హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై ఉండడం, రైల్వేస్టేషన్ ఉండడం, కొలనుపాకలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన జైన ఆలయం, సోమేశ్వరాలయం, ఆర్కియాలజీ మ్యూజియం, యాదాద్రి పుణ్య క్షేత్రం ఉండడం ఆలేరుకు కలిసొచ్చే అంశాలుగా ఉన్నాయి.

## గడువులోగా అందుబాటులోకి వచ్చేనా!

పెద్దపల్లి: శాసనసభ్యులు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులోకి ఉండేందుకు గత ప్రభుత్వం నియోజకవర్గ కేంద్రాల్లో క్యాంపు కార్యాల యాలకు భవన నిర్మాణాలు చేపట్టింది. కాగా పెద్దపల్లిలో పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి. జిల్లాలోని మూడు నియోజకవర్గ కేంద్రాల్లో భవన నిర్మాణాల కోసం ప్రభుత్వం ఒక్కో చోట రూ.కోటి నిధులు విడుదల చేసింది. మంథని, రామగుండంలలో 2018 ఎన్నికల తరువాత భవనాలు అందుబాటులోకి వచ్చాయి. కానీ పెద్దపల్లిలో మాత్రం స్థలం ఎంపికలో నెలకొన్న వివాదాలతో పనులు ఆలస్యమయ్యాయి. చివరికి వ్యవసాయ శాఖ గోదాం స్థలంలోనే నిర్మాణానికి ప్రభుత్వం అనుమతించడంతో గతేడాది పనులు ప్రారంభించారు. ప్రధాన భవనం నిర్మాణం పూర్తయినప్పటికీ ప్రహరీ, అంతర్గత నిర్మాణాలు చేయాల్సి ఉంది. పనులు పూర్తి చేయడానికి మరో మూడు నెలల గడువుందని, ఈలోగా పూర్తి చేస్తామని ఆర్అండ్‌బీ ఇన్‌ఛార్జి ఈఈ రాములు తెలిపారు.

# ఎన్నికల సందడి ముగిసే.. యాసంగి సాగు మొదలాయె!



సిరిసిల్ల : శాసన సభ ఎన్నికల సందడి ముగిసిన నేపథ్యంలో యాసంగి పంటల సాగులో వేగం పుంజుకోనుంది. జిల్లాలో గత అయిదేళ్లుగా సాగు నీటి సౌకర్యం గణనీయంగా పెరిగింది. రాజరాజేశ్వర, ఎగువమానేరు, మూలవాగు, సింగసముద్రం జలాశయాలతోపాటు పల్లెల్లోని చెరువులు, కుంటల్లో జలకళ ఉట్టిపడుతోంది. భూగర్భ జల మట్టాలు మెరుగ్గా ఉండటంతో సాగు నీటి లభ్యతకు ఢోకా లేదు. గత నెల ఆరంభంలో యాసంగి సీజన్ ప్రారంభం కాగా మరికొద్ది రోజుల్లోనే పంటల సాగు ప్రక్రియ వేగం పుంజుకోనుంది. ఈ మేరకు విత్తనాలు, ఎరువులను అన్నదాతలు సమకూర్చుకుంటున్నారు. నీటి లభ్యతతో జిల్లాలోని కొన్ని మండలాల్లో వరినార్లు పోసే ప్రక్రియకు శ్రీకారం చుడుతుండగా, మరికొన్ని చోట్ల నాట్లకు పొలాలను సిద్ధం చేశారు. జిల్లాలో ఈ సంవత్సరం యాసంగి సీజన్‌లో అన్ని రకాల పంటలు కలుపుకొని మొత్తం 1,82,339.12 ఎకరాల విస్తీర్ణంలో సాగవుతాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. అందుకు సరిపడా ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచుతున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాలో వరి, మొక్కజొన్న ప్రధాన పంటలుగా యాసంగిలో రైతులు సాగు చేస్తారు. 4,72,329 ఎకరాల భౌగోళిక విస్తీర్ణమున్న జిల్లాలో 2,90,380 ఎకరాల భూమి పంటల సాగుకు అనుకూలంగా ఉంటుంది. ప్రస్తుతం నీటి వనరుల్లో జలకళ ఉట్టిపడుతోంది. 1,75,335 ఎకరాల్లో వ్యవసాయ పంటలు, 6,317 ఎకరాల్లో ఉద్యాన వన పంటలను సాగు చేస్తారని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొన్నారు. వ్యవసాయ పంటల్లో 1,73,100 ఎకరాల్లో వరి, 1,014 ఎకరాల్లో మొక్కజొన్న, 65.12 ఎకరాల్లో వేరుసెనగ, 240 ఎకరాల్లో నువ్వులు, 303 ఎకరాల్లో పొద్దుతిరుగుడు, 392 ఎకరాల్లో శనగ వేయనున్నారు. ఉద్యాన వన పంటల్లో 687 ఎకరాల్లో ఆయిల్‌పాం, 550 ఎకరాల్లో కూరగాయలు, 5,767 ఎకరాల్లో పండ్ల తోటలను పెంచనున్నారు. ఇల్లంతకుంట మండలంలో అత్యధికంగా 24 వేల ఎకరాల్లో వరి పంట వేయనుండగా, రుద్రంగిలో అత్యల్పంగా 3,500 ఎకరాలకు పరిమితం కానుంది. వరిసాగు విస్తీర్ణంలో 18,600 ఎకరాలతో తంగళ్లపల్లి మండలం రెండో స్థానంలో నిలవనుండగా, 17,500 ఎకరాలతో కోనరావుపేట, గంభీరావుపేట మండలాలు మూడో స్థానంలో ఉంటాయని అధికారులు అంచనా వేశారు.

అందుబాటులో ఎరువులు

పంటల సాగు విస్తీర్ణానికి అనుగుణంగా ఎరువుల కొరత లేకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నారు. పంట కాలం పూర్తయ్యే నాటికి జిల్లాలో 21,673 మెట్రిక్ టన్నుల యూరియా, 3,338 మెట్రిక్ టన్నుల డీఏపీ, 11,444 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్, 4,577 మెట్రిక్ టన్నుల ఎంవోపీ కలుపుకొని మొత్తం 42,463 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయని అంచనా వేశారు. ప్రస్తుతం 7,100 మెట్రిక్ టన్నుల యూరియా, 921 మెట్రిక్ టన్నుల డీఏపీ, 2,172 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్, 126 మెట్రిక్ టన్నుల ఎంవోపీ ఎరువుల నిల్వలు ఉన్నాయి. సాగులో వేగం, పంట యాజమాన్య కాలాలకు అనుగుణంగా సరిపడా ఎరువులను సమకూర్చేందుకు ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు.పంట యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి భూమిరెడ్డి, వ్యవసాయ మండలశాఖ అధికారి, ఎల్లారెడ్డిపేటవరి నాట్లు వేసే ప్రక్రియ నుంచే సరైన పంట యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చు. మొగిపురుగు ఉద్ధృతి తగ్గించుకోవడం కోసం నార్లు తీసే వారం రోజుల ముందు కిలో కార్బోఫ్యూరాన్ త్రీజీ గుళికలను ఎకరం విస్తీర్ణానికి వచ్చే నారులో చల్లుకుంటే 15 రోజుల వరకు మొగిపురుగు ఆశించకుండా కాపాడుతుంది. స్వల్పకాలిక, మధ్యకాలిక రకాలను 21 నుంచి 30 రోజుల మధ్యలో నాట్లు వేసుకోవచ్చు. వ్యవసాయంలో సాంకేతిక పద్ధతులను రైతులు పాటించాలి. వెదజల్లడం, డ్రమ్‌సీడర్‌తో వరి గింజలు విత్తితే ఎకరానికి రూ. 5 వేల వరకు పెట్టుబడి ఖర్చులు ఆదా చేసుకోవచ్చు. నేరుగా వరిమొలకను విత్తితే దిగుబడి కూడా భారీగా వస్తుంది. రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. లైసెన్సు పొందిన దుకాణాలు, సొసైటీల ద్వారా ప్రభుత్వ ఆమోదిత విత్తనాలు కొనుగోలు చేయాలి. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో లాట్ నంబరుతో బిల్లులు తీసుకోవాలి.

# హోర్డింగ్ ఏర్పాటుపై వివాదం



కరీంనగర్ : నగరంలోని ఉస్మాన్‌పురలోని బాలికల పాఠశాల ఆవరణలో హోర్డింగ్ టవర్ ఏర్పాటు వివాదాస్పదంగా మారింది. ఇక్కడ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉర్దూ ఉన్నత పాఠశాల ఒకే ఆవరణలో కొనసాగుతున్నాయి. ఇంటర్మీడియట్ విద్యాశాఖ కమిషనర్ నుంచి అనుమతి తీసుకుని అద్దె ప్రతిపాదికన ఏర్పాటుకు అనుమతిచ్చామని కళాశాల ప్రిన్సిపల్, అధికారులు చెబుతుండగా.. పాఠశాలకు సంబంధించిన స్థలంలో సమాచారం లేకుండా దీన్ని ఎలా ఏర్పాటు చేస్తారని విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్ఎంసీ కమిటీ వారు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులెవరని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ఈ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు ప్రారంభించగా తల్లిదండ్రులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో అవి నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో హోర్డింగ్ ఏర్పాటు పనులు చర్చనీయాంశమయ్యాయి. ప్రైవేటుగా హోర్డింగ్ ఏర్పాటుతో కళాశాల నిర్వహణకు నిధులు సమకూర్చుకునేందుకు దీని ఏర్పాటుకు కొటేషన్లను ఆహ్వానించి నిబంధనల ప్రకారం ఇంటర్ విద్యా కమిషన్ నుంచి అనుమతి తీసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ రవీందర్‌రెడ్డికు తెలిపారు. తల్లిదండ్రులు, ఎస్ఎంసీ కమిటీ తీర్మానం మేరకు ఇక్కడ నిర్మించొద్దంటూ జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణగోపాల్ పేర్కొన్నారు.

తొలగించాలని ఆదేశం

కార్పొరేషన్: నగరపాలక అనుమతి లేకుండా ఏర్పాటు చేస్తున్న హోర్డింగ్‌ను తొలగించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆదేశించారు. కార్పొరేటర్ రవీందర్‌సింగ్ పరిశీలించి బల్దియా అనుమతి లేకుండా ఎలా నిర్మిస్తారని నిలదీశారు. అంతకుముందు టీపీవో శ్రీహరి, టీపీఎస్ నవీన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రిన్సిపల్ ఒకరికి ఎన్‌వోసీ ఇచ్చారని, హెచ్ఎం అభ్యంతరం తెలిపారన్నారు. టౌన్‌ప్లానింగ్ నుంచి ఇంకా అనుమతే ఇవ్వలేదని వెల్లడించారు.

# ఇక పంచాయతీల్లో ఎన్నికల పండగ..!

భువనగిరి : గ్రామ పంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ రంగం సిద్ధం చేస్తోంది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అశోక్‌కుమార్ జిల్లా కలెక్టర్లకు, జిల్లా పంచాయతీ అధికారులకు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. పోలింగ్‌కు అవసరమైన సిబ్బందిని సమకూర్చి వారి వివరాలను టీపోల్ సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు. నియామక ప్రక్రియను ఈ నెల 30లోపు పూర్తి చేయాలని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న గ్రామ సర్పంచుల పదవీ కాలం 1.2.24తో ముగియనుంది. పదవీ విరమణకు మూడు నెలల ముందుగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. ఒక్కో జిల్లాలో మూడు విడతలుగా పోలింగ్ నిర్వహించాలని కమిషన్ నిర్ణయించింది.

పోలింగ్ సిబ్బంది ఇలా....ఎన్నికలకు అవసరమయ్యే సిబ్బందిని సమకూర్చుకునేందుకు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను జారీ చేసింది. 200 ఓటర్లు ఉన్న గ్రామపంచాయతీకి ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక పోలింగ్ అధికారిని నియమించే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని నిర్దేశించింది. 400 ఓటర్ల వరకు ఒక పీవో, ఇద్దరు పోలింగ్ అధికారులు, 650 ఓట్లు ఉన్న పోలింగ్ కేంద్రంలో ఒక పీవో, ముగ్గురు పోలింగ్ అధికారులను నియమించాలని కమిషన్ ఉత్తర్వుల్లో పేర్కొంది.

గడువులోపు జరిగేనా..?

ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా 1740 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కొత్త పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం గతంలో ఖరారు చేసిన రిజర్వేషన్లు పదేళ్ల వరకు వర్తిస్తాయని ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో పాత రిజర్వేషన్లతో ఎన్నికలు జరుగుతాయా, లేక కొత్త ప్రభుత్వం చట్టాన్ని మార్చుతుందా అనే అనుమానాలు ఉన్నాయి. చట్టంలో మార్పులు జరిగిన పక్షంలో జనాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ రిజర్వేషన్లను చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం శాసనసభ ఎన్నికల్లో కూర్పు చేసిన ఓటర్ల జాబితాను గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రామాణికంగా తీసుకుంటారు. ఈ జాబితాను గ్రామ పంచాయతీల, వార్డుల వారీగా విభజించాల్సి ఉంటుంది. జాబితా తయారు చేయడంతో పాటు అభ్యంతరాలు స్వీకరించడం, తుది ఓటర్ల



జాబితాను ప్రకటించేందుకు కనీసం నెల రోజుల వ్యవధి పడుతుందని అధికారులు చెబుతున్నారు. బ్యాలెట్ బాక్స్‌ల సమీకరణతో పాటు బ్యాలెట్ పత్రాల ముద్రణ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఎన్నికల పనులు పూర్తి చేసేందుకు గడువు చాలదన్న భావన అధికార వర్గంలో ఉంది. దీంతో ఎన్నికలు అనుకున్న సమయంలో జరుగుతాయా లేదా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఎన్నికలకు అవసరమయ్యే బడ్జెట్‌పై ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో సమావేశం ఇప్పటికే జరిగింది. జిల్లాల వారీగా ప్రతిపాదనలు ఉన్నతాధికారులు అడిగినట్లు సమాచారం.

మళ్లీ మొదలవబోతోంది వేడి

వచ్చే ఏడాది ప్రారంభంలోనే మళ్లీ ఎన్నికల వేడి పుట్టనుంది. గ్రామ పంచాయతీ, పార్లమెంటు, మండల, జిల్లా ప్రాదేశిక ఎన్నికలు వరుసగా జరగనుండటంతో గ్రామాల్లో ఏడాది పాటు ఎన్నికల పండగ వాతావరణం నెలకొననుంది. గత ఐదేళ్లుగా పదవులకు దూరంగా ఉన్న నేతలు అప్పుడే ఎన్నికలపై దృష్టి సారించారు. క్షేత్రస్థాయిలో ఎక్కువ సంఖ్యలో భారాసకు చెందిన ప్రజాప్రతినిధుల చేతుల్లోనే పాలనా పగ్గాలున్నాయి. ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా పరిధిలో 12 నియోజకవర్గాలుండగా 11 స్థానాల్లో కాంగ్రెస్ గెలవడంతో అ ప్రభావం రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై ఉంటుందని భావిస్తున్నారు.

## భక్తుల కొంగుబంగారం కైలాస్‌టెకిడి

బోథ్: చుట్టూ పచ్చటి అడవి. ఓ కొండపై రాళ్లతో నిర్మించిన శివాలయం. తెలంగాణ సరిహద్దు ప్రాంతంలోని నిగిని గ్రామ సమీపంలోని శ్రీ శిఖర్ కైలాస్ కొండపై 21 ఏళ్ల కిందట రాతి శివలింగం లభ్యమైంది. కలలో కనిపించిన మహేశ్వరుడికి రూపం ఇచ్చి, ఆలయాన్ని నిర్మించి పూజలు నిర్వహిస్తున్నారు కైలాస్‌టెకిడి ఆలయ పూజారి లింబాజీ మహరాజ్. అప్పటి నుంచి భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతోంది.

ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల కేంద్రం నుంచి 22 కిలోమీటర్ల దూరంలో ఉంది. రాతితో కట్టిన కైలాస్‌టెకిడి నర్మదేశ్వర ఆలయం భక్తులను విశేషంగా ఆకర్షిస్తుంది. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని దయాల్ ధన్నూర్‌కు చెందిన లింబాజీ మహరాజ్ ఈ గుడిని నిర్మించారు. ఒక రోజు శివుడు కలలో కనిపించి శివలింగం ఆకారంలో ఉన్న తనకు పూజలు చేయమని లింబాజీ మహరాజ్‌కు చెప్పారట. ఈ విషయం తన ఇంట్లో వాళ్లకి, ఇరుగు పొరుగు వారికి చెప్పినా ఎవరు పట్టించుకోలేదట. దాంతో కుటుంబాన్ని, ఊరిని వదిలి 2002లో శివలింగం ఆకారంలో ఉన్న కొండపై పాక వేసుకొని శివలింగానికి పూజలు చేయటం ప్రారంభించారు. ఈ విషయం ఆ నోటా, ఈ నోటా పాకి గిరిజనులు రావటం, పూజలు చేయటం ప్రారంభించారు. దాదాపు అయిదేళ్ల కాలంలో ఈ ఆలయం గురించి బాహ్య ప్రపంచానికి తెలిసింది. 2009లో మహేశ్వరుడికి రాతి గుడి కట్టించాలని, తన దగ్గర ఉన్న డబ్బులతో పనులను ప్రారంభించారు. కొన్ని రోజుల తరువాత కర్తార్ అనే వ్యక్తి లింబాజీ మహరాజ్‌తో కలిసి గుట్టపైకి బండలను చేర్చారు. బండలు కొండ పైకి చేరేలా ఇనుప పట్టాలతో మార్గం తయారు చేశారు. చుట్టు ప్రక్కల పలు గ్రామాల ప్రజలు సైతం చేయూతనివ్వటంతో గుడి కట్టారు. ఆలయానికి ఎదురుగా పెద్ద నంది విగ్రహాన్ని సైతం ఏర్పాటు చేశారు.

పూర్తిగా రాతి నిర్మాణం..

కైలాస్‌టెకిడి నర్మదేశ్వర ఆలయాన్ని నిర్మించటానికి మహారాష్ట్ర నాందేడ్ జిల్లాలోని కందార్ నుంచి కొదరాయి, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ నుంచి నల్ల రాయిని తెప్పించారు. రాళ్లను చెక్కి దేవుని రూపం కొండపైకి చేర్చారు. వందేళ్లు చెక్కుచెదరకుండా ఉండేలా కుంకుడుకాయలు, తాటి బెల్లం, అరటి పండ్ల మిశ్రమాన్ని వాడారు. రాతి స్తంభాలపై నంది, శివలింగం, త్రిశూలం, శేషనాగు, నెమలి విగ్రహాలను చెక్కి కొండ పైకి ఎక్కించారు. 2016లో కాశీ వేదపండితులతో గర్భగుడిలో శివలింగాన్ని ప్రతిష్ఠించారు. ఈ విగ్రహాలతో పాటు పలు దేవుళ్ల విగ్రహాలను సైతం ఈ ఆలయంలో రాతి స్తంభాలపై చెక్కించారు. గర్భగుడిలో శివలింగాన్ని ప్రతిష్ఠించి రోజూ పూజలు చేస్తున్నారు.

ఏటా అయిదు రోజుల పాటు జాతర..డిసెంబరు నెలలో అయిదు రోజుల పాటు పెద్ద ఎత్తున ఆలయ వార్షికోత్సవాన్ని జాతరలా నిర్వహిస్తుంటారు. ఈ జాతరకు తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి భక్తులు వస్తుంటారు. దేశంలో ప్రఖ్యాతి పొందిన పలువురు సాధువులు ఈ ఆలయానికి వస్తుంటారు. అయిదు రోజుల పాటు నిష్ఠతో ఆలయ పూజారి ఉపవాసం ఉంటూ ప్రత్యేక పూజలు చేస్తారు. మంగళవారం నుంచి జాతర ప్రారంభమైంది. శనివారం వరకు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. రోజూ వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తుల కోసం చిన్న కుటీరాలను ఏర్పాటు చేశారు.

## కోడ్ ముగిసింది.. అడ్డంకి తొలగింది

ఆదిలాబాద్ : శాసనసభ సమరం ముగిసింది. ఎన్నికల కోడ్‌ను సైతం అధికారులు ఎత్తివేశారు. దీంతో ఆగిన అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలో గత అక్టోబరులో ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగా.. ఆ క్షణం నుంచే ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చింది. దీంతో జిల్లాలో అనేక అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. ఇక ఏమాత్రం జాప్యం చేయకుండా కొత్తగా ఎన్నికైన శాసన సభ్యులతో పాటు అధికారులు, గుత్తేదారులు ప్రగతిని పరుగులు పెట్టించాలని ప్రజలు కోరుతున్నారు.

కాగజ్‌నగర్ పురపాలికతోపాటు జిల్లా కేంద్రంలో కొన్ని పనులు ఏళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. గుత్తేదారుల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణలేమితో అనేక పనులు అసంపూర్తిగా మిగిలాయి.

ప్రతిపాదనలకే పరిమితం గత జూన్ 30న అప్పటి సీఎం కేసీఆర్ ఆసిఫాబాద్‌లోని జిల్లా పాలనాధికారి కార్యాలయం ప్రారంభోత్సవ సమావేశంలో కాగజ్‌నగర్ పురపాలిక, ఆసిఫాబాద్ మేజర్ గ్రామ పంచాయతీకి రూ.25 కోట్ల చొప్పున మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. వాటికి పనులు ప్రతిపాదించి, సకాలంలో పనులు చేపట్టాల్సిన అధికారులు నేటికీ జాప్యం చేస్తున్నారు. ప్రతి గ్రామ పంచాయతీకి రూ.10 లక్షల చొప్పున జిల్లాలో ఉన్న 335 పంచాయతీలకు రూ.35కోట్లు నిధులు మంజూరు చేశారు. ఈ నిధులు అలాగే మూలుగుతున్నాయి.జిల్లాకు డీఎంఎఫ్‌టీ(డిస్ట్రిక్ మినరల్ ఫండ్ (ట్రస్టు), ఎన్‌డీఎఫ్, సీడీఎఫ్(ప్రత్యేక నియోజకవర్గ అభివృద్ధి నిధులు), సీఎస్‌ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులు ఏటా రూ.వందల కోట్లు మంజూరవుతున్నాయి. వాటితో చేపట్టిన అనేక పనులు నేటికి అసంపూర్తిగానే ఉన్నాయి. ఈ నిధులతో కమ్యూనిటీ భవనాలు, సీసీ రోడ్లు, మురుగుకాలువలు, తాగునీటి సదుపాయం, చేతిపంపులు, సోలార్ వాటర్ ప్లాంట్లు, తారురోడ్ల నిర్మాణాలను చేపట్టాల్సి ఉంది.

నిధులున్నా..మూడేళ్ల క్రితం కాగజ్‌నగర్ పురపాలికలో సమీకృత మార్కెట్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.7.50 కోట్లు మంజూరు చేసింది. స్థల సమస్య కారణంగా తీవ్ర జాప్యం జరిగింది. ఎన్నికల కోడ్‌కు ముందే స్థల సమస్య తీరినప్పటికీ పనుల్లో పురోగతి లేదు. పురపాలిక పరిధిలో రూ.4 కోట్లతో చేపట్టిన నాలుగు వైకుంఠధామాల పనులు కొలిక్కి రావడం లేదు.కౌటాల మండల కేంద్రంలో రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించనున్న విద్యుత్తు ఉపకేంద్రం పనులు శంకుస్థాపనకే పరిమితమయ్యాయి. తెలంగాణ- మహారాష్ట్రల మధ్య రవాణా కారిడార్‌కు గుండాయిపేట- నందివార్దా అంతర్రాష్ట్ర వంతెన నిర్మాణానికి రూ.75కోట్లు మంజూరు చేయగా, శంకుస్థాపన చేసి వదిలేశారు. ఎన్నికల కోడ్ ముగిసినందున కొత్త పనులతో పాటు పాత వాటిపైనా దృష్టిసారించాలని జిల్లావాసులు కోరుతున్నారు.

కాగజ్‌నగర్ పురపాలిక పరిధిలోని 6వ వార్డులోని రైల్వే కాలనీ నుంచి కాపువాడ వరకు బీటీ రహదారి నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరయ్యాయి. టెండర్ల ప్రక్రియ పూర్తి కాగా.. పనులు శాసనసభ ఎన్నికల కోడ్‌తో ప్రారంభం కాలేదు. ఇప్పుడు కోడ్ ముగియడంతో త్వరగా రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. కాగజ్‌నగర్ పురపాలిక పరిధిలోని భట్టుపల్లి చౌరస్తా నుంచి రహదారికి ఇరువైపులా డ్రైనేజీ లేదు. దీంతో మురుగు రహదారిపైనే నిలుస్తోంది. వ్యాపారులు, పాదచారులు అటుగా వెళ్లాలంటే అసౌకర్యానికి గురవుతున్నారు. అభివృద్ధి పనులతోపాటు ఇలాంటి సమస్యలపై దృష్టిసారించాల్సి ఉంది.జిల్లా కేంద్రంలోని పలు వీధుల్లో మురుగు కాలువల నిర్మాణాలు లేక కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు.

# జీహెచ్‌ఎంసీలో జీతాల్లేవు

హైదరాబాద్: రెండు నెలలపాటు ఎన్నికల విధుల్లో చెమటోడ్చిన జీహెచ్‌ఎంసీ ఉద్యోగులకు, రేయింబవళ్లు రోడ్లు ఊడ్చిన పారిశుద్ధ్య కార్మికులకు జీతాల్లేవు. 7వ తేదీ వచ్చినా ఇంకా ఎదురు చూపులే. ఆస్తిపన్ను, నిర్మాణ అనుమతుల రుసుము వసూలవక బల్దియా ఖజానా ఖాళీ అవడంతో ఈ దుస్థితి నెలకొంది. హైదరాబాద్ మహానగరపాలక సంస్థ ఖాతాలో.. రూ.10కోట్లు కూడా లేకపోవడంతో జీతాల చెల్లింపుపై కమిషనర్ కార్యాలయం చేతులెత్తేసింది. దాంతో ఇంటి అద్దెలు చెల్లించలేక, బస్సు ఛార్జీలకు డబ్బుల్లేక పారిశుద్ధ్య కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. వైద్యం, నెలవారీ ఔషధాలకు పింఛనుదారులు కష్టాలు పడుతున్నారు. గుదిబండలా అప్పులు.. జీహెచ్‌ఎంసీ ఖాతాలో 2015 నవంబరు 1 వరకు రూ.1,200కోట్ల మిగులు నిధులుండేవి. దానిపై వచ్చే వడ్డీతో ఉద్యోగులు, కార్మికుల జీతాలు చెల్లించేవారు. రూ.35వేల కోట్ల అంచనా వ్యయంతో పైవంతెనలు, అండర్‌పాస్‌లు, ఆకాశ మార్గాల నిర్మాణం కోసం రూపొందించిన ఎస్సార్డీపీని జీహెచ్‌ఎంసీ భుజానికెత్తుకుంది. సదరు కార్యక్రమం కోసం బల్దియా ఇప్పటి వరకు



రూ.5,500 కోట్ల అప్పు చేసింది. నాలాల అభివృద్ధి కోసం చేపట్టిన వ్యూహాత్మక నాలాల అభివృద్ధి కార్యక్రమం, మూసీపై వంతెనల నిర్మాణం రూపేణా మరో రూ.500కోట్ల అప్పు ఖాతాలో చేరింది. ఏడాదికి 7.05శాతం నుంచి 10.23శాతం వడ్డీతో తీసుకున్న ఆయా రుణాలకు జీహెచ్‌ఎంసీ ప్రతినెలా కోట్లాది రూపాయల వడ్డీ చెల్లిస్తోంది. ఠంచనుగా కిస్తీలు చెల్లించకపోతే మార్కెట్‌లో జీహెచ్‌ఎంసీ పరపతి పడిపోయే ప్రమాదం ఉండటంతో.. ఉద్యోగుల జీతాలకన్నా.. కిస్తీల చెల్లింపునకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో కార్మికులు, పింఛనుదారులు, ఉద్యోగులు గత కొన్ని నెలలుగా సమయానికి జీతాలు అందుకోలేకపోతున్నారు.

రాష్ట్ర రాజధానిలో రోడ్లు, పైవంతెనలు, అండర్‌పాస్‌లు, ఆకాశ మార్గాలను నిర్మించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంటుందనేది నిపుణుల అభిప్రాయం. కమిషనర్ల నిర్లక్ష్యంతో.. కేవలం రూ.2వేల కోట్ల వార్షిక ఆదాయమున్న బల్దియాపై తీవ్ర ఆర్థిక భారం పడిందంటున్నారు. ఎస్ఆర్‌డీపీ, ఎస్ఎన్‌డీపీ, సీఆర్ఎంపీ, హెచ్ఆర్‌డీసీఎల్, ఇతరత్రా కార్యక్రమాల నిర్వహణ బాధ్యతల నుంచి బల్దియాకు విముక్తి కల్పించాలని, లేదంటే.. సర్కారు రూ.20వేల కోట్ల ప్రత్యేక నిధి విడుదల చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఆ రెండింటికే రూ.120కోట్లు

విశ్రాంత ఉద్యోగులకు పింఛన్లు, ఐదు వేల మంది ఉద్యోగులు, 20వేల మంది కార్మికులకు జీతాలు, పదవీ విరమణ పొందే వారి ఆర్థిక ప్రయోజనాలను విడుదల చేయాలంటే జీహెచ్‌ఎంసీకి ప్రతినెలా రూ.120కోట్లు అవసరం. అప్పుడే సమయానికి చెల్లింపులు పూర్తవుతాయి. నెలవారీ వడ్డీ కట్టేందుకు మరో రూ.100కోట్లు అవసరమున్న విషయం తెలిసిందే.

# విద్వేష ఘటనల్లో నగరం నంబర్ 1

హైదరాబాద్: తప్పుడు సమాచారం, వదంతుల్ని ప్రచారం చేయడం, వర్గాలు, సమూహాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం వంటి ఘటనలు భాగ్యనగరిలోనే అత్యధికంగా నమోదవుతున్నాయి. ఈ తరహా నేరాల్లో దేశంలోనే తొలిస్థానంలో నిలుస్తోంది. ఎన్‌సీఆర్‌బీ- 2022 నివేదిక ప్రకారం గతేడాది దేశంలోని 19 మెట్రో నగరాల్లో సామాజిక మాధ్యమాలు, ఇతర వేదికల ద్వారా తప్పుడు సమాచారం వ్యాప్తి, వదంతుల్ని ప్రచారం చేయడంపై 97 కేసులు నమోదయ్యాయి. ఇందులో హైదరాబాద్‌లోనే 57 ఘటనలు రికార్డయినట్లు ఎన్‌సీఆర్‌బీ ప్రకటించింది. అంటే సగటున 58.7% నగర పరిధిలో నమోదయ్యాయి. ముంబయి, దిల్లీ, బెంగళూరు, చెన్నై తదితర నగరాలు మనకంటే వెనుకే నిలుస్తున్నాయి. వర్గాలు, సమూహాల మధ్య విద్వేషాల్ని రెచ్చగొట్టిన ఘటనలు భాగ్యనగరిలో ఎక్కువ సంఖ్యలో నమోదవడం కలవరపెడుతోంది. 2022 సంవత్సరంలో అన్ని నగరాల్లో కలిపి 204 ఘటనలు నమోదవగా.. హైదరాబాద్‌లోనే 41 కేసులు నమోదయ్యాయి.




దేశంలోని మెట్రోనగరాల్లో ఇదే అత్యధికం. దిల్లీ, కోయంబత్తూరులో మాత్రమే 20కి మించి కేసులు రికార్డయ్యాయి.

ఇక్కడే ఎందుకంటే..!

సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం, విద్వేషపూరిత వ్యాఖ్యలపై ప్రత్యేక నిఘా ఉంచడంతో నగరంలో ఎక్కువ కేసులు నమోదవుతున్నాయని పోలీసులు చెబుతున్నారు. వదంతులు, తప్పుడు పోస్టులపై నిఘా ఉంచేందుకు సైబర్‌క్రైం, స్మాష్ పేరుతో ప్రత్యేక విభాగం పనిచేస్తోంది. ఈ ఘటనలపై ఐటీ చట్టం కింద ఈ కేసులు నమోదు చేస్తున్నారు.

అక్రమ నిర్బంధాలు అధికమే

వ్యక్తుల్ని అక్రమంగా నిర్బంధించడంలో హైదరాబాద్‌లోనే అత్యధిక ఘటనలు నమోదవుతున్నాయి. 2022లో హైదరాబాద్‌లో 236 మందిని నిర్బంధించినట్లు కేసులు నమోదయ్యాయి. లఖ్‌నవూ 89తో రెండో స్థానంలో ఉంది.సగం ఘటనలు ఇక్కడే..ఉద్యోగ విధుల్ని అడ్డుకోవడం, వారిపై దాడులు వంటి ఘటనలతో హైదరాబాద్ నగరం దేశంలోనే తొలిస్థానంలో నిలిచింది. 2022లో మొత్తం 18 ఘటనల్లో 18 మంది ఉద్యోగులపై దాడులు జరిగాయి. ఎన్‌సీఆర్‌బీ రికార్డుల ప్రకారం.. దేశంలోని 19 మెట్రో నగరాల్లో కలిపి 35 ఘటనలు నమోదైతే.. నగరంలోనే సగం ఉన్నాయి. బెంగళూరు-5, లఖ్‌నవూ-4, ముంబయి-3, ఘజియాబా ద్-2, దిల్లీ-1, అహ్మదాబాద్-1, ఇండోర్-1 చొప్పున నమోదయ్యాయి.

# ఆరుగాలం కష్టం.. అన్నదాతకు దుఃఖం



ఖమ్మం : మిగ్‌జాం తుపాను కారణంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో వివిధ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రధానంగా వరి, మొక్కజొన్న, మిరప, వేరుసెనగ పంటలు ఎక్కువగా దెబ్బతిన్నాయి. 4, 5 అడుగుల ఎత్తు ఉన్న మొక్కజొన్న మొక్కలు వాలిపోయాయి. అధిక వర్షాల కారణంగా పొలాల్లో నీళ్లు నిలవటంతో మిరప తోటలకు సైతం పెద్దఎత్తున నష్టం వాటిల్లింది. వరి, పత్తి, వేరుసెనగ లాంటి పంటలు చేతికందాల్సిన తరుణంలో దెబ్బతినటంతో అన్నదాతలు కోలుకోలేని పరిస్థితిలో ఉన్నారు. ఖమ్మం జిల్లాలో 82,211 ఎకరాల్లో 53,883 మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 13,608 ఎకరాల్లో 7,450 మంది రైతులు నష్టపోయారు.

పంట నష్టంపై ప్రాథమిక అంచనా

ఉభయ జిల్లాల కలెక్టర్లు గౌతమ్, ప్రియాంక ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయాధికారులు, ఏఈఓల ఆధ్వర్యంలో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పొలాలను పరిశీలించి ప్రాథమికంగా పంట నష్టం అంచనాలను రూపొందించారు. బాధిత రైతులతో మాట్లాడారు. ఖమ్మం జిల్లాలో 357 గ్రామాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లింది. సత్తుపల్లి డివిజన్‌లో వరిపైరు అత్యధికంగా 23,499 ఎకరాల్లో దెబ్బతింది. వైరాలో 18,830, మధిరలో 12,054 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. ఖమ్మంలో 3,057, కూసుమంచిలో 2,367 ఎకరాల్లో దెబ్బతింది. మధిర డివిజన్‌లో మొక్కజొన్న పంట అత్యధికంగా 2,056 ఎకరాల్లో నష్టపోయింది. వైరాలో 2,014, ఖమ్మంలో 1,495, సత్తుపల్లిలో 1,127, కూసుమంచిలో 15 ఎకరాల్లో దెబ్బతింది. వైరా డివిజన్‌లో మిరప 7,198 ఎకరాల్లో నష్టపోయింది. మధిరలో 3,729, సత్తుపల్లిలో 2,845, ఖమ్మంలో 2,700, కూసుమంచిలో 795 ఎకరాల్లో దెబ్బతింది. భద్రాద్రి జిల్లాలో 253 గ్రామాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లింది.

పాల్వంచ మండలంలో వరి పైరు 1,222 ఎకరాల్లో దెబ్బతింది. సుజాతనగర్‌లో 1,185, చంద్రుగొండలో 1,050 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. చర్ల మండలంలో 493 ఎకరాలు, చంద్రుగొండ మండలంలో 464, పాల్వంచ మండలంలో 460 ఎకరాల్లో మిరప తోటలు దెబ్బతిన్నాయి. అశ్వారావుపేట మండలంలో 820 ఎకరాలు, దమ్మపేటలో 627, ములకలపల్లిలో 155 ఎకరాల్లో వేరుసెనగ పంటకు నష్టం వాటిల్లింది.

తెగిన రహదారి.. నిలిచిన రాకపోకలు

సత్తుపల్లి మండలం చెరుకుపల్లి పంచాయతీ జగన్నాథపురం ఆర్అండ్ఆర్ సెంటర్ సమీపంలోని లోచప్టా వద్ద మట్టి రోడ్డు తెగిపోయి రాకపోకలు నిలిచాయి. రామానగరం, గంగారం మధ్యలోని లోచప్టాతో పాటు తారు రోడ్డు సైతం కాలువలోని వరద కారణంగా తెగిపోయింది. కల్లూరు ఆర్డీఓ అశోక్‌చక్రవర్తి, సీఐ మోహన్‌బాబు ఆయా రోడ్లపై బారికేడ్లు ఏర్పాటు చేసి రాక పోకలను నిలిపివేశారు. బేతుపల్లి పెద్ద చెరువు సైతం మూడు అడుగుల మేర అలుగుపారింది. తమ్మిలేరు నుంచి పెద్దఎత్తున వరద నీరు ఏపీకి తరలివెళ్లింది.

పంట నష్టాన్ని అంచనా వేయండి: కలెక్టర్

తుపాను ప్రభావంతో రెండు రోజులుగా జిల్లాలో జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసి ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. కూసుమంచిలో కోతకు సిద్ధంగా ఉండి, నేలకొరిగిన వరి క్షేత్రాన్ని జిల్లా అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. వ్యవసాయ విస్తరణాధికారులు క్షేత్ర స్థాయిలో ఉంటూ అంచనాలు రూపొందించాలని జిల్లా వ్యవసాయాధికారిణి విజయ నిర్మలకు సూచించారు. రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలు తెలుసుకున్నారు. పాలేరులో ఐకేపీ ఆధ్వర్యంలో, జక్కేపల్లిలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. పాలేరులో కేంద్రం ప్రారంభించినా ఈ ఏడాది ఒక్కరైతూ ధాన్యాన్ని తీసుకరాని విషయాన్ని అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. జక్కేపల్లి సొసైటీ కొనుగోలు కేంద్రంలో ఇప్పటికే 2,400 క్వింటాళ్ల ధాన్యాన్ని రైతులు విక్రయించినట్లు, ఈ ప్రాంతంలో కోతలు పూర్తయిన దృష్ట్యా కొనుగోలు నిలిపివేసినట్లు వివరించారు. జక్కేపల్లిలోని సొసైటీ కార్యాలయం, గిడ్డంగిని కలెక్టర్ పరిశీలించారు. శిక్షణ సహాయ కలెక్టర్ మయాంక్‌సింగ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిణి విద్యాచందన, జిల్లా సహకార అధికారిణి విజయకుమారి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిణి శ్రీలత, ఎంపీడీఓ రమాదేవి, ఏడీఏ విజయచంద్ర, ఏఓ వాణి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో భారీ వర్షపాతం నమోదు

తుపాను ప్రభావంతో ఖమ్మం జిల్లావ్యాప్తంగా రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరపి లేకుండా వాన కురుస్తున్నందున జన జీవనం స్తంభించింది. జన సంచారం లేక రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. రైతులు సాగు చేస్తున్న వరి, మొక్కజొన్న, పత్తి, మిరప తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పలు చెరువుల్లో నీరు చేరింది. జిల్లాలో వరకు సరాసరిన 99.2 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు జిల్లా ప్రణాళిక అధికారి శ్రీనివాస్ తెలిపారు. సత్తుపల్లి మండలంలో అత్యధికంగా 158.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా నమోదైన వర్షపాతం వివరాలు ఇలా... సింగరేణి 75.4, కామేపల్లి 61.8, రఘునాథపాలెం 63.2, ఖమ్మం రూరల్ 71.8, తిరుమలాయపాలెం 55.6, కూసుమంచి 60.4, నేలకొండపల్లి 42.6, ముదిగొండ 67.8, చింతకాని 68.4, ఖమ్మం అర్బన్ 77.8, కొణిజర్ల 90.0, ఏన్కూరు 140.0, కల్లూరు 136.2, పెనుబల్లి 126.2, వేంసూరు 155.4, తల్లాడ 99.0, వైరా 115.0, బోనకల్లు 128.6, మధిర 144.0, ఎర్రుపాలెం 146.2 మి.మీ. వర్షపాతం నమోదైంది.

ÿ వైరా రిజర్వాయర్‌లోకి 1,670, పాలేరు జలాశయానికి 912, లంకాసాగర్ ప్రాజెక్టులోకి 1,990, బేతుపల్లి పెద్ద చెరువులోకి 14 వేలు, జాలిముడి ప్రాజెక్టులోకి 2,268, కట్టలేరు ప్రాజెక్టులోకి 765 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందని నీటిపారుదల శాఖ సీఈ (చీఫ్ ఇంజినీర్) విద్యాసాగర్ తెలిపారు.జిల్లాలో ఉదయానికి చెరువుల్లో నీటి నిల్వ ఇలా...మొత్తం చెరువులు: 1,056

0 - 25 శాతం నీటి నిల్వ: 481

25 - 50 శాతం నీటి నిల్వ: 326

50 - 75 శాతం నీటి నిల్వ: 199

75 - 100 శాతం నీటి నిల్వ: 36

100 శాతం దాటి అలుగుల పైనుంచి నీరు ప్రవహిస్తున్నవి: 14

# పంచాయతీ ఎన్నికలకు సమాయత్తం




ఖమ్మం : శాసనసభ ఎన్నికల కోలాహలం ముగిసి కొత్త ప్రభుత్వం ఏర్పడుతున్న వేళ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఎస్ఈసీ (రాష్ట్ర ఎన్నికల సంఘం) ఏర్పాట్లు చేస్తోంది. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఎస్ఈసీ చర్యలు చేపట్టింది. బ్యాలెట్ పద్ధతిలో పోలింగ్ జరగనుంది. శాసనసభ ఎన్నికల్లో ఈవీఎంలు ఉపయోగించిన విషయం విదితమే. గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ ఈవీఎంల వినియోగంపై ఇటీవల ఎస్ఈసీ కసరత్తు చేసింది. చివరకు గతంలో మాదిరిగా బ్యాలెట్ పద్ధతిలో పోలింగ్ నిర్వహించి అదేరోజు ఎన్నికల ఫలితాలు వెల్లడించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అవసరమయ్యే పోలింగ్ సిబ్బందిని గుర్తించాలని, %Te-poll% సాఫ్ట్‌వేర్‌లో వివరాలు అప్‌లోడ్ చేసి ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్‌కుమార్ అన్ని జిల్లాల కలెక్టర్లకు లేఖ రాశారు. ఈనెల 30లోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీ వార్డుకు ఒక పోలింగ్ కేంద్రం ఉండాలని, 200 మంది ఓటర్లకు ఒక పోలింగ్ బూత్, అందులో ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక పోలింగ్ అధికారి, 201 నుంచి 400 మంది ఓటర్లున్న పోలింగ్ బూత్‌లో ఒక ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ అధికారులు, 400 నుంచి 650 మంది ఓటర్లున్న పోలింగ్ బూత్‌లో ఒక ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు పోలింగ్ అధికారుల చొప్పున సిబ్బందిని నియమించాలని, అదనంగా 20 శాతం మందిని ఎంపిక చేసి రిజర్వ్‌లో ఉంచాలని సూచించారు.

2019 జనవరిలో గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించగా ఫిబ్రవరి 1 నుంచి పాలకవర్గాలు మనుగడలోకి వచ్చాయి. 2024 జనవరి 31 నాటికి ప్రస్తుత గ్రామ పంచాయతీ పాలకవర్గాల ఐదేళ్ల పదవీకాలం ముగియనుంది. ఈలోగానే గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తుండగా బ్యాలెట్ పెట్టెలపై అతికించాల్సిన పేపర్ సీల్స్, అడ్రస్ ట్యాగ్స్ ముద్రణకు చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్‌కుమార్ ఆదేశించారు. చంచల్‌గూడలోని రాష్ట్ర ప్రభుత్వ ప్రింటింగ్ ప్రెస్‌కు జిల్లా వారీగా ఇండెంట్ పంపించి ముద్రించాలని, అదనంగా పది శాతం రిజర్వ్‌లో ఉంచాలని సూచించారు. ఖమ్మం జిల్లాలో వార్డుల సంఖ్యను అనుసరించి పేపర్ సీల్స్, అడ్రస్ ట్యాగ్స్ 23,800 చొప్పున, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 19 వేల చొప్పున ముద్రించనున్నారు.

# చలికాలం సమస్యలకు.. ఆయుర్వేదంతో అడ్డుకట్ట

హైదరాబాద్: చలి వాతావరణంలో ప్రతి ఒక్కరూ వివిధ ఇన్‌ఫెక్షన్లకు గురవుతుంటారు. పిల్లల నుంచి వృద్ధుల వరకు అనేక సమస్యలు వెంటాడుతుంటాయి. ఈ కాలంలో వచ్చే ఇన్‌ఫెక్షన్ల నుంచి ఆయుర్వేద చిట్కాలు, మందులతో ఉపశమనం పొందవచ్చునని ఎర్రగడ్డలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఉమాశ్రీనివాస్ చెప్పారు. ముఖ్యంగా జలుబు, దగ్గు, తలనొప్పి, జ్వరం, ఒళ్లు నొప్పులు, గొంతులో గరగర, గొంతు నొప్పి తదితర సాధారణ సమస్యలను నిత్యం ఇంట్లో వినియోగించే పదార్థాలతో చాలావరకు కట్టడి చేయవచ్చని చెప్పారు. కొన్ని రకాల ఆయుర్వేద మందులతో వ్యాధి నిరోధక శక్తి పెంచుకోవచ్చునని వివరించారు.

జ్వరం, జలుబు, దగ్గు లాంటి వైరల్ ఇన్‌ఫెక్షన్లకు అమృత (గూడూచి) ఆకులను దంచి రసాన్ని తీయాలి. టీస్పూన్ చొప్పున మిరియాల పొడితో కలిపి మూడు పూటలా తీసుకోవాలి. ఇలా ఐదు రోజులు చేస్తే.. జ్వరం, గొంతు నొప్పి తగ్గుతాయి. లేదంటే మహాలక్ష్మి విలాసరస్, లక్ష్మి విలాసరస్ మాత్రలు ఉదయం, సాయంత్ర ఒకటి చొప్పున ఐదు రోజులపాటు వేసుకుంటే పూర్తిగా ఉపశమనం కలుగుతుంది.

కఫంతో కూడిన దగ్గు, పొడి దగ్గు ఉంటే కరక్కాయ ముక్కను నోట్లో పెట్టుకొని చప్పరించాలి. లేదంటే అయిదు తులసి ఆకులు, రెండు



లవంగాలు, మూడు మిరియాలు కలిపి దంచి ఆ పొడిని తీసుకోవాలి. వీటితోపాటు అడ్డసరం ఆకుల రసం మిరియాల పొడితో టీ స్పూన్ చొప్పున ఉదయం, సాయంత్రం తీసుకోవాలి.

కొందరికి గొంతు నొప్పి ఎక్కువగా ఉంటుంది. వీరు పాలల్లో 5-6 గ్రాముల మిరియాల పొడి వేసి 5-7 రోజులపాటు తాగాలి. దీనితోపాటు అర చెంచా పసుపు వేసి తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది. గొంతు నొప్పితోపాటు జలుబు తగ్గుతుంది. ఎక్కువగా జలుబు ఉంటే లవంగాదివటి మాత్రలు ఉదయం, సాయంత్రం ఒకటి చప్పరించాలి. చాలామందిలో తలనొప్పి ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి వారు శొంఠి అరగదీసి రెండు కణతలకు పూసుకోవాలి. ఉదయం, సాయంత్రం ఇలా చేస్తే ఉపశమనం పొందవచ్చు. ఎక్కువ తలనొప్పి ఉంటే సుదర్శన్‌ఘనవటి ఆయుర్వేద మాత్రలు మూడు పూటలా ఒక్కొక్కటి తీసుకోవాలి. ఇవేకాక త్రిభువన కీర్తిరస్, మృత్యుంజయ రస్‌లల్లో ఏదో ఒక మాత్రలు ఉదయం, సాయంత్రం ఒకటి తీసుకుంటే తలనొప్పితోపాటు గొంతులో మంట, ఒళ్లునొప్పులు, నీరసం నుంచి ఉపశమనం పొందవచ్చు.

గొంతు నొప్పితోపాటు గరగర ఉంటే త్రిఫల చూర్ణం టీ స్పూన్ వంతున గ్లాసులోని గోరు వెచ్చటి నీటిలో వేసి ఉదయం, సాయంత్రం పుక్కిలిస్తే తగ్గుముఖం పడతాయి. ఈ కాలంలో ఇన్‌ఫెక్షన్లకు అడ్డుకట్ట వేయాలంటే వ్యాధి నిరోధక శక్తి పెంచుకోవాలి. గూడూచి, అశ్వగంధ, శతావరి చూర్ణాలు మూడింటిని సమపాళ్లలో కలిపి టీస్పూన్ వంతున ఉదయం, సాయంత్రం తీసుకోవాలి.జ్వరంతో జలుబు, దగ్గు ఉంటే పుదీనా ఆకు రసం, తమలపాకుల రసం ఉదయం, సాయంత్రం టీస్పూన్ చొప్పున తీసుకోవాలి. దీంతో పాటు ఒక లవంగాన్ని చప్పరిస్తే జలుబు, దగ్గునుంచి ఉపశమనం లభిస్తుంది.

# కల్లం దాటని ధాన్యం.. కర్షకుల్లో కలవరం

పరిగి : ధాన్యం చేతికందివస్తున్నా పూర్తి స్థాయిలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో అధికారులు ఇంకా మీనమేషాలు లెక్కిస్తున్నారు. కల్లం దాటే పరిస్థితిలేక ఓవైపు, ఆకాశం మేఘావృతం కావడంతో మరోవైపు అన్నదాతలు ధాన్యం రక్షణ ఎలాగని తీవ్ర ఆందోళన చెందుతున్నారు. చినుకు పడితే చాలు నేల తడిసి వరికోత యంత్రాలకు అవరోధంగా మారుతుంది. ఇప్పటికే యంత్రాల కొరత కారణంగా పడుతున్న పాట్లు అన్నీఇన్నీ కావు. ఇలాంటి పరిస్థితుల్లో కోతలు పూర్తయిన ధాన్యం కూడా వెంటవెంటనే కొనుగోలు చేయకపోవడంతో అవస్థలు తప్పేలా లేవు. క్షేత్రస్థాయిలో పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు చెబుతున్నా వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటున్నాయి. దీనికి సంబంధించి కథనం.

పొలాల్లోనే ధాన్యం రాశులు

ఆయా కేంద్రాల్లో ఇప్పటి వరకు సుమారు 5వేల క్వింటాళ్లను మాత్రమే కొనుగోలు చేశారు. ధాన్య రాశులు పొలాల్లోనే ఉన్నాయి. తుపాన్ ప్రభావం కారణంగా పలు మండలాల్లో మంగళవారం చిరు జల్లులు కురిశాయి. టార్పాలిన్లు కూడా అందుబాటులో లేకపోవడంతో ధాన్యం రక్షణ తలకుమించిన భారంగా మారింది. గతంలో వ్యవసాయ, ఉద్యానశాఖలు రైతులకు రాయితీపై టార్పాలిన్లు పంపిణీ చేసేది. ఏళ్లుగా వాటి ఊసే లేకపోవడంతో బయటి మార్కెట్లో అప్పు చేసి ఎక్కువ ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు.

గన్నీ సంచుల కొరత

అధికారుల లెక్కల ప్రకారం జిల్లాకు వాస్తవంగా దాదాపు 43లక్షల గన్నీ బస్తాలు అవసరం. వీటి సమస్య ఉత్పన్నం కాకుండా ఉండేందుకు అధికారులు పక్కా ప్రణాళికతో పనిచేయాల్సిన అవసరం ఉంది. వర్షాలు కురిస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముంది. వీటి కొరతను అధిగమించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నెల క్రితమే కోతలు ప్రారంభం

జిల్లాలోని పరిగి, తాండూరు, వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలో వానాకాలం వరి సాధారణ సాగు 1.33లక్షల ఎకరాల విస్తీర్ణంలో సాగులోకి వచ్చింది. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఒకటి, డీసీఎమ్మెస్ ఆధ్వర్యంలో 27, ఐకెపి 26, ప్రాథమిక సహకార సంఘాలు 64, వ్యవసాయ మార్కెటింగ్, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో మొత్తం 123 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి. అయితే కేవలం ప్రస్తుతం 35 మాత్రమే ప్రారంభానికి నోచుకున్నాయి.

వాతావరణం మార్పులతో రైతన్నలు దినదినగండంగా గడపాల్సి వస్తోంది. జిల్లా వ్యాప్తంగా నెల క్రితమే వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఈపనులు పూర్తిచేసిన కర్షకులు నిత్యం కేంద్రాల కోసం వేచి చూస్తున్నారు. నెల రోజులుగా అధికారులు ఎన్నికల విధుల్లో ఉన్నారు. ఇప్పుడు ఎన్నికలు పూర్తయ్యాయి కాబట్టి కనీసం ఇప్పటికైనా కేంద్రాల ప్రారంభానికి సత్వర చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

త్వరలో అన్నీ అందుబాటులోకిరాజేశ్వర్, జిల్లా పౌరసరఫరాల అధికారి ధాన్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి తొలిదశలో అక్కడ ప్రారంభించాం. మిగతా మండలాల్లో త్వరలోనే పూర్తిస్థాయిలో ప్రారంభించి కొనుగోలు వేగవంతం చేస్తాం. ఎక్కడా ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

# రైతులకు మేలు.. సభ్యులకు లాభాలు..!

కొత్తగూడెం : అన్నదాతల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం రైతు ఉత్పత్తిదారుల సంస్థలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కర్షకులను ప్రమోటర్లు, డైరెక్టర్లు, వాటాదారులుగా చేర్చి విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, పశువుల దాణా, ఇతర సామగ్రి విక్రయ కేంద్రాల ఏర్పాటుకు సహకరించనుంది. దళారీ వ్యవస్థ లేకుండా రైతులకు నేరుగా ఉత్పత్తులను అందించటం ఈ పథకం లక్ష్యం. ఈ కేంద్రాల్లో రైతులు సభ్యత్వం కలిగి ఉంటారు. ఒక్కో సంస్థలో కనీసం 750 మంది అన్నదాతల భాగస్వామ్యం తప్పనిసరి.

బోర్డు నిర్ణయాల ప్రకారం..

నిర్వహణ, నియంత్రణ కోసం ఒక మేనేజర్/ సీఈఓను నియమించుకుని బోర్డులో తీసుకునే నిర్ణయాలు అమలుచేస్తారు. వివిధ రకాల ఉత్పత్తులను సంస్థల నుంచి నేరుగా సేకరించి రైతులకు అందిస్తారు. తద్వారా రైతులకు పెట్టుబడి తగ్గడమే కాకుండా ఈ వ్యాపారంలో




వచ్చిన లాభాల్లో సభ్యులైన కర్షకులు వాటాలు పొందుతారు. అలాగే పంటలను నేరుగా మిల్లర్లకు రైతు ఉత్పత్తిదారుల సంస్థ ద్వారా విక్రయించడంతో మంచి ధరలు వచ్చే అవకాశముంది. వ్యాపారంతో సంస్థకు ఆదాయం వస్తుంది. ప్రాసెసింగ్, ప్యాకింగ్ చేయడం ద్వారా అదనపు రాబడిని సముపార్జించవచ్చు. రైతు ఉత్పత్తిదారుల సంస్థ ద్వారా చేసే ఈ కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం ఉంటుంది. కేంద్ర వ్యవసాయ శాఖ ద్వారా ఈ పథకం పర్యవేక్షణ జరుగుతుంది.

ప్రోత్సాహకాలు ఇలా..కేంద్ర వ్యవసాయ, సహకార శాఖల నుంచి రైతు ఉత్పత్తిదారుల సంస్థకు వ్యాపార నిర్వహణ రుణం అందిస్తున్నారు. షేర్ క్యాపిటల్‌గా ప్రతి రైతు నుంచి రూ.2వేలు సేకరించి సభ్యత్వం ఇస్తారు. రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు క్రెడిట్ కార్డు సౌకర్యం, బీమా కల్పిస్తారు. కౌలు రైతులకూ ఈ సౌకర్యముంటుంది. ఈ సంస్థను సక్రమంగా నిర్వహించేందుకు ప్రోత్సాహకంగా ఏడాదికి రూ.6 లక్షల చొప్పున మూడేళ్లపాటు అందిస్తారు.

తొలి విక్రయ కేంద్రమిదే..

కేంద్రం చేపట్టిన ఈ పథకంలో భాగంగా ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో తొలిసారిగా రఘునాథపాలెం మండలం చిమ్మపూడిలో శ్రీబాలాజీ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్‌ను ఏర్పాటు చేశారు. పక్షం రోజుల క్రితం ఏర్పాటైన ఈ సంస్థలో ఇప్పటికే 250 మంది సభ్యులుగా చేరారు. ఈ సంస్థ ద్వారా రైతులకు తక్కువ ధరకే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందిస్తున్నారు. ఉభయ జిల్లాల్లో పలుచోట్ల రైతు ఉత్పత్తిదారుల సంస్థలు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలున్నాయి.

రైతు ఉత్పత్తిదారుల సంస్థ ద్వారా అన్నదాతలకు ఎంతో మేలు కలుగుతుంది. రైతుల భాగస్వామ్యంతో దీన్ని నిర్వహిస్తున్నాం. చిమ్మపూడితోపాటు పరిసర గ్రామాలకు చెందిన సుమారు 1,000 మందిని సభ్యులుగా చేర్చాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నాం. గుత్తా వెంకటేశ్వర్లు, ఛైర్మన్, శ్రీబాలాజీ రైతు ఉత్పత్తిదారు సంస్థ

# తుపాకులు పేలుతున్నాయి..!

మహబూబాబాద్ : ఉమ్మడి జిల్లాలో తుపాకీ కాల్పుల ఘటనలు కలవరపెడుతున్నాయి. ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన నేపథ్యంలో లైసెన్స్ తుపాకులను పోలీస్ శాఖ వద్ద డిపాజిట్ చేయాలి. ఈ ప్రక్రియ సజావుగా సాగడం లేదు. వీటిని పొందుతున్న వారిలో రియల్టర్లే ఎక్కువగా ఉన్నారు. కొందరు రౌడీ షీటర్ల వద్ద కూడా ఉన్నట్లు సమాచారం. హనుమకొండ జిల్లా గుండ్ల సింగారంలో కానిస్టేబుల్ ప్రసాద్.. ఎస్సై రివాల్వర్‌ను దొంగిలించి అత్తను కాల్చి చంపాడు. పచ్చని పంట పొలాలతో ప్రశాంతంగా ఉండే గ్రామం ఈ ఘటనతో ఒక్కసారిగా ఉలిక్కిపడింది. తుపాకీ హత్య మునుపెన్నడూ లేకపోవడంతో గ్రామస్థులు ఆందోళనకు గురయ్యారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నప్పుడు పోలీస్‌శాఖ తుపాకుల వినియోగంపై దృష్టి పెట్టాలి. ఆ కానిస్టేబుల్ వినియోగించిన 9 ఎంఎం తుపాకీ.. పోలీసు శాఖ ఆయనకు కేటాయించింది కాదు. అది తాను విధులు నిర్వహిస్తున్న స్టేషన్ ఎస్సైది. పోలీసులు ఎంత అజాగ్రత్తగా వ్యవహరిస్తున్నారనేది దీన్ని బట్టి తెలుస్తోంది.

గత నెల 15న హనుమకొండ జిల్లా పరకాలలోని ఓ బిల్డర్.. కొంత మంది మధ్య రాజకీయ పరమైన అంశాల్లో వాదనలు పెరగడంతో తన లైసెన్స్ తుపాకితో గాల్లోకి రెండు రౌండ్ల కాల్పులు జరిపాడు. అక్కడున్న వారికి ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు తెలిపిన లెక్కల ప్రకారం ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో 221 లైసెన్స్ తుపాకులు ఉన్నాయి.

వరంగల్ పోలీసు కమిషనరేట్ (హనుమకొండ, వరంగల్, జనగామ): 185 , మహబూబాబాద్: 28, ములుగు: 1, భూపాలపల్లి 7 వీటిలో దాదాపు 50 వరకు బ్యాంకులకు సంబంధించినవి ఉంటాయి. వీటికి మినహాయింపు ఉంటుంది. మిగతా 171 తపాకులు వ్యక్తుల వద్ద ఉండగా వాటిలో ఇప్పటి వరకు 74 మంది పోలీసులకు అప్పగించారు. ఇంకా 98 మంది వారి వద్దనే ఉంచుకున్నారు.

చర్యలు తీసుకుంటాం..– సత్యనారాయణ, డీఎస్పీ, మహబూబాబాద్

ఎన్నికల కోడ్ నేపథ్యంలో లైసెన్స్ తుపాకులను సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలని చెప్పాం. ఒక్కొక్కరుగా అప్పగిస్తున్నారు. హైదరాబాద్‌లో ఉన్న వారికి కూడా సమాచారం చేరవేశాం. నిబంధనల ప్రకారం ఇవ్వకుంటే చర్యలుంటాయి.

# మణుగూరు ఓసీ విస్తరణకు సమాయత్తం



మణుగూరు : మణుగూరు ఉపరితల (ఓపెన్ కాస్ట్) గని విస్తరణ ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. గని జీవితకాలం మరో మూడేళ్లే ఉండటంతో, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా విస్తరించాల్సి వస్తోంది. గని విస్తరణకు ఎంత భూమి కావాలో సింగరేణి అంచనా వేసి సిద్ధం చేసింది. కావాల్సిన భూమిని సేకరించేందుకు అటవీ, రెవెన్యూ శాఖకు ప్రతిపాదనలు పంపనుంది. కొద్దిరోజుల కిందట భూసేకరణపై సింగరేణి అధికారులు అటవీ అధికారులతో చర్చించారు. 2016లో ఏర్పడిన మణుగూరు ఓసీ గని జీవిత కాలం పదేళ్లు. ప్రస్తుతం ఏడాదికి 21 లక్షల టన్నుల బొగ్గుని వెలికి తీస్తున్నారు.

2026 నాటికి ఉత్పత్తే లక్ష్యంగా..ఓసీ గని విస్తరణకు సింగరేణి సంస్థ సుమారు రూ.120 కోట్ల పైనే వెచ్చించనుంది. ఎక్కువ శాతం భూ పరిహారం రూపంలో రెవెన్యూ శాఖకు చెల్లించనుంది. గని విస్తరణకు 439.28 హెక్టార్లను తీసుకోనుంది. అందులో అటవీ భూమి 74.55, ప్రభుత్వ, లేదా అసైన్డ్ భూమి 327.60, పట్టా భూమి 37.67 హెక్టార్ల మేరకు ఉండనుంది. అటవీ శాఖ నుంచి తీసుకునే భూమికి సింగరేణి సంస్థ మరోచోట ఆశాఖకు భూమి కేటాయించాలి. గని జీవితకాలం పూర్తయ్యేలోపే భూసేకరణ ప్రక్రియను ముగించాలన్న నిశ్చయంతో సింగరేణి ఉంది. 2026 నాటికి విస్తరణ పనులు పూర్తి చేసి బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించింది.

ఇళ్లు కోల్పోకుండా భూ సేకరణ

సింగరేణి సంస్థ మణుగూరు ఓసీ గని విస్తరణలో ఇళ్లు కోల్పోకుండా భూ సేకరణ చేపట్టనుంది. ఇళ్లు కోల్పోతే ఎక్కువ మొత్తంలో పరహారాన్ని సింగరేణి చెల్లించాల్సి ఉంటుంది. మొదటిసారిగా మణుగూరు ఓసీ గని ఏర్పాటుకు సింగరేణి అటవీ, వ్యవసాయ భూములతో పాటు, ఇళ్లను తీసుకొంది. పద్మగూడెం, మల్లేపల్లి, ఎగ్గడిగూడెం వంటి గ్రామాలు కనుమరుగయ్యాయి. ఈ సారి ఆపరిస్థితి లేకుండా ముందుచూపుతో తిర్లాపురం, రామానుజవరం గ్రామాల్లోని అటవీ భూమితో పాటు సాగు భూముల్ని సేకరించనుంది.

అవకతవకలకు చోటివ్వకుండా..

కొన్నేళ్ల కిందట మణుగూరు ఓసీ గని ఏర్పాటు సమయంలో నిర్వాసితులకు పరిహారం చెల్లింపులో అనేక అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. భూమి లేని వారికీ పరిహారం చెల్లించారని, అసలైన వారికి చెల్లించలేదని చర్చ నడిచింది. ఆరోపణల నేపథ్యంలో సీఐడీ విచారణ కొనసాగింది. మళ్లీ రెండో దఫా గని అవసరాలకు భూసేకరణ చేపట్టనున్న నేపథ్యంలో రెవెన్యూ, సింగరేణి అధికారులు పారదర్శకంగా వ్యవహరించి నిర్వాసితులకు పరిహారం చెల్లించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గని మొత్తం విస్తీర్ణం: 1116.55 హెక్టార్లు
ప్రస్తుత విస్తీర్ణం: 672 హెక్టార్లు
ప్రతిపాదిత నూతన సేకరణ విస్తీర్ణం: 439.28 హెక్టార్లు

# నిబంధనలు ఇవి.. పాటించాల్సిందే మరి




కొత్తగూడెం : రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చింది. ప్రచారం మొదలు ఓట్ల లెక్కింపు వరకు ఇది అమల్లో ఉంటుంది. ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేల వెంట పరిగెత్తి వ్యవహారాలను చక్కబెట్టిన అధికారులే.. ఇకపై వారి కదలికలు, ప్రచార శైలిని ఓ కంట కనిపెట్టనున్నారు. ఇప్పటికే ప్రభుత్వ పథకాల పోస్టర్లు, ఫ్లెక్సీలను తొలగించిన అధికారులు నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలకు ఉపక్రమించనున్నారు. ఎన్నికల కోడ్ అమలు సమయంలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనలు, అధికారుల ఏర్పాట్లు తదితర అంశాలపై 'ఈనాడు' కథనం.

సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారానికి చెక్

ఎన్నికల సందర్భంగా సామాజిక మాధ్యమాల్లో జరిగే ప్రచారంపై మీడియా మానిటరింగ్ కమిటీ దృష్టిసారిస్తుంది. కలెక్టర్, పోలీసు అధికారులు, సీనియర్ రిపోర్టర్, పౌరసంబంధాల అధికారి, సీనియర్ సిటిజన్ సభ్యులతో మీడియా మానిటరింగ్ కమిటీని ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. రాజకీయ పార్టీలు, నాయకులు, అభ్యర్థులు, సామాజిక మాధ్యమాల్లో చేస్తున్న ప్రచార కార్యక్రమాలను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. అవాంఛనీయ అంశాలను ప్రచారం చేసిన సదరు వ్యక్తులపై చర్యలు తీసుకుంటుంది.

సామాన్యులకు ఇబ్బందిగా నగదు తరలింపు..!

ఎన్నికల సందర్భంగా భారీగా నగదు చేతులు మారుతుందనే అనుమానంతో పోలీసులు చేసే తనిఖీల వల్ల సామాన్యులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అత్యవసరాల నిమిత్తం తీసుకెళ్లే నగదు, బంగారు ఆభరణాలకు సరైన ఆధారాలు లేవంటూ పోలీసులు స్వాధీనపరచుకుంటున్నారని సామాన్యులు వాపోతున్నారు. కోడ్ అమలులో ఉన్నంత కాలం వీలైనంత మేర ఆన్‌లైన్ లావాదేవీలు జరిపితే మంచిదని పోలీసులు సూచిస్తున్నారు. ఒకవేళ అత్యవసరంగా నగదు తీసుకెళ్లాల్సి వచ్చినా ఆధారాలు చూపాల్సి ఉంటుందని చెబుతున్నారు.

అనుమతులు తప్పనిసరి..

రాజకీయ పార్టీలు ప్రచార ప్రకటనలు, లౌడ్ స్పీకర్లను వినియోగించేందుకు ప్రత్యేకంగా అధికారుల అనుమతి తీసుకోవాలి.

అభ్యర్థి ప్రచారానికి మూడు వాహనాలను మాత్రమే వినియోగించాలి. వీటికి సైతం ఎన్నికల అధికారి అనుమతి తప్పనిసరి.

ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి రాత్రి, పగలు తేడా లేకుండా ఎప్పుడైనా ఫిర్యాదు చేయవచ్చు.

ప్రైవేటు స్థలాల్లో ప్రచారానికి ఇంటి, స్థల యజమాని అనుమతి తప్పనిసరి.

ప్రచార ఖర్చుల వివరాలను ఎప్పటికప్పుడు ఎన్నికల అధికారులకు అందజేయాలి.

ర్యాలీలు, ప్రచారం, సభలు, సమావేశాలను నిర్దేశిత సమయంలోగా ముగించాలి.

ప్రధానంగా ఎనిమిది అంశాలపై దృష్టి..

ఎన్నికల క్రతువులో పార్టీలు, నేతలు, అభ్యర్థుల ప్రసంగాలు, సభలు–సమావేశాలు, ఊరేగింపులు–ర్యాలీలు, పోలింగ్ రోజు ఆంక్షలు, పోలింగ్ కేంద్రాల్లో ఆంక్షలు, పర్యవేక్షకుల నియామకం, అధికార పార్టీకి నిబంధనలు, ఎన్నికల మ్యానిఫెస్టోలు కీలక పాత్ర పోషిస్తుంటాయి. వీటితో పాటు మరో ఎనిమిది అంశాలపై ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు సమయంలో ప్రత్యేక నిఘా ఉంటుంది.

కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీలు ప్రచారంలో ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగించకూడదు.

అధికార పార్టీలు కొత్త పథకాలు, ప్రాజెక్టులు, విధానాలను ప్రకటించకూడదు.

ప్రభుత్వ ఖర్చులతో పత్రికలు, మీడియా, ఇతర మాధ్యమాల్లో ప్రకటనలపై నిషేధం ఉంటుంది.

మంత్రులు, నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారు అధికారిక కార్యక్రమాల పేరిట ప్రచారం చేయకూడదు. ప్రభుత్వ వాహనాలువినియోగించరాదు.

బహిరంగ సభల నిర్వహణకు మైదానాలు, హెలిప్యాడ్‌ల వినియోగంలో అధికార పార్టీతో పాటు అన్నీ పార్టీలకు ఒకే నిబంధన వర్తిస్తుంది.

ప్రభుత్వాలు ఎలాంటి తాత్కాలిక నియామకాలు చేపట్టకూడదు.

ఎన్నికల ప్రచారానికి వేదికలుగా దేవాలయాలు, మసీదులు, చర్చిలు, ఇతర ప్రార్థన మందిరాలను ఉపయోగించకూడదు.

ఎన్నికలకు 48 గంటల ముందు ఎలాంటి ప్రచారం చేయకూడదు.

యువతే నిర్ణేత

శాసనసభ ఎన్నికల్లో యువ ఓటర్ల పాత్ర కీలకం కానుంది. కొత్తగా నమోదైన ఓటర్లలో రాష్ట్రంలోనే ఖమ్మం జిల్లా అగ్రభాగాన నిలిచింది. భద్రాద్రి,

ఖమ్మం జిల్లాల్లోని పది నియోజకవర్గాల్లోనూ అభ్యర్థుల గెలుపోటములను యువ ఓటర్లు శాసించనున్నారు. అన్ని స్థానాల్లో 18–29 ఏళ్ల ఓటర్ల సంఖ్య గతం కన్నా గణనీయంగా పెరిగింది.

ఉభయ జిల్లాల్లో.. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 21,41,387 మంది ఓటర్లలో 18–29 ఏళ్ల యువతీయువకులు 4,77,515 (22.30 శాతం) మంది ఉన్నారు. ఖమ్మం నియోజకవర్గంలో యువ ఓటర్లు అత్యధికంగా (74,261 మంది), భద్రాచలం నియోజకవర్గంలో అత్యల్పంగా (27,216 మంది) నమోదయ్యారు. పది నియోజకవర్గాల్లోనూ యువ ఓటర్లు భారీగా ఉండటంతో ప్రధాన పార్టీలు వారిని ఆకట్టుకునేందుకు యత్నిస్తున్నాయి.

# ఇక మారుమూల పల్లెల్లో హలో హలో

మహబూబాబాద్ : రాష్ట్రంలోనే అత్యధిక అటవీ ప్రాంతంతో పాటు జనసాంద్రత తక్కువగా ఉన్న ములుగు జిల్లాలో మారుమూల ప్రాంతాలు చాలా ఉన్నాయి. వీటికి సరైన సమాచార వ్యవస్థ లేకపోవడంతో అత్యవసర సమయాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గిరిజన గ్రామాలకు ఇప్పటికీ పూర్తిస్థాయిలో చరవాణి సంకేతాలు అందడం లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం మారుమూల ప్రాంతాలకు 4జీ సిగ్నల్ ద్వారా ఇంటర్‌నెట్‌ను అందించాలని సంకల్పించింది. ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్‌తో పాటు ప్రైవేటు సంస్థలకు కూడా టవర్ల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చారు.

జిల్లాలో 23 గ్రామాలకు...

జిల్లాలోని మారుమూలలో ఉన్న పూర్తిగా సిగ్నళ్లు లేని గ్రామాల్లో 23 చోట్ల కొత్తగా టవర్లు ఏర్పాటు చేసి బీఎస్ఎన్ఎల్ ద్వారా 4జీ సేవలను అందించడానికి చేపట్టిన పనులు పురోగతిలో ఉన్నాయి.

పురోగతిలో పనులు...

ఈ పనులకు సంబంధించిన ఉత్తర్వులు గత వేసవికాలంలోనే ఇచ్చారు. గుత్తేదారుల కేటాయింపు, వర్షాల కారణంగా చాలా చోట్ల పనులు ఇప్పుడిప్పుడు మొదలవుతున్నాయి. అంటే ఈ ఏడాది చివర వరకు అన్ని మారుమూల ప్రాంతాల్లో టవర్లు ఏర్పాటు చేసి సేవలను ప్రారంభించే అవకాశం ఉంది. ఏటూరునాగారం మండలంలోని చల్పాకలో టవర్ కేటాయింపునకు స్థలం రెవెన్యూ శాఖ కేటాయించినా ఇంకా బీఎస్ఎన్ఎల్ గుత్తేదారుకు అప్పగించ లేదు.

తప్పనున్న ఇబ్బందులు...

ఏజెన్సీ ఏరియాలో సిగ్నల్ లేకపోవడంతో చాలా గిరిజన గ్రామాల్లో ప్రభుత్వ సేవలు నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నారు. పింఛన్లు ఇతర సేవలకు సంబంధించి వేలిముద్రల నమోదుకు, రేషన్‌బియ్యం తీసుకోవడానికి, సమాచారం అందించడానికి అవస్థలు పడేవారు. వర్షాకాలంలో గ్రామాలతో సంబంధాలు నిలిచిపోయినప్పుడు సమాచారవ్యవస్థ లేకపోవడంతో ప్రాణాలు పోగొట్టుకున్న సందర్భాలు చోటుచేసుకున్నాయి. కన్నాయిగూడెం మండలంలోని ఐలాపూర్‌లాంటి గ్రామాలు వర్షాకాలంలో పూర్తిస్థాయిలో జలదిగ్బంధంలో చిక్కుకుని విలవిలలాడుతుంటాయి. ఇలాంటి గ్రామాలకు పూర్తిస్థాయిలో చరవాణి సేవలు ఉంటే కనీసం ఆన్‌లైన్ ద్వారా తాము ఎదుర్కొంటున్న సమస్యలను బయటి ప్రపంచానికి తెలియజేసే అవకాశం ఉంటుంది.

గ్రామాల వివరాలు..కన్నాయిగూడెం: కంతనపల్లి, చింతగూడెం, ఐలాపూర్, చిట్యాల, భూపతిపురం
ఏటూరునాగారం: మల్యాల, చల్పాక
మంగపేట: నిమ్మగూడెం, కొత్తూరు మొట్లగూడెం
తాడ్వాయి: రంగాపూర్, అంకంపల్లి, లింగాల, బంధాల, ఒడ్డుగూడెం, బంజారా ఎల్లాపూర్
వెంకటాపూర్: బండ్లపహాడ్

వీటితో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని వాజేడు, వెంకటాపురం మండలాల్లో 3 చొప్పున ఆరు ప్రాంతాల్లో టవర్ల ఏర్పాటు పనులకు అనుమతులు వచ్చాయి.

త్వరగా సేవలు అందించాలి– కాక వెంకటేశ్వర్లు, సర్పంచి, కొండాయి, ఏటూరునాగారం మండలం.

మా పంచాయతీ పరిధిలో మల్యాలలో సెల్‌టవర్ ఏర్పాటుకు అనుమతులు వచ్చాయి. గత వర్షాకాలంలో చరవాణి సంకేతాలు అందకపోవడంతో చాలా ఇబ్బందులు పడ్డాం. వారధి తెగిపోయిన సందర్భంలో అధికారులకు సమాచారం ఇద్దామంటే కుదరలేదు. సకాలంలో పనులు పూర్తి చేసి సేవలు అందించాలి.

పూర్తి చేసేలా చూస్తాం– రాధాకిషన్, జేఈ, బీఎస్ఎన్ఎల్.

ప్రతి గ్రామానికి ఇంటర్‌నెట్ అందేలా టవర్‌లను ఏర్పాటు చేస్తున్నాం. మొన్నటి భారీవర్షాలకు పనులు నిలిచిపోయాయి. పనులు రెండు మూడు నెలల్లో పూర్తయి సేవలను అందించే అవకాశం ఉంది.

# ఓటు.. ప్రజాస్వామ్య బుల్లెట్టు!

వరంగల్ : ప్రస్తుతం ఇజ్రాయెల్, పాలస్తీనా మధ్య జరుగుతున్న యుద్ధం ఆందోళన కలిగిస్తోంది. ఎప్పుడు ఏ ఆయుధం దూసుకొస్తుందో తెలియని పరిస్థితి.. మిలిటెంట్ల చేతుల్లో బందీలై తుపాకుల తూటాలకు బలవుతున్నవారు ఎందరో.. మరోవైపు రష్యా, ఉక్రెయిన్ యుద్ధ సమయంలోనూ వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ పరిస్థితుల్లో భారత్ వైపు ప్రపంచం చూస్తోంది. దీనికి కారణం ఇక్కడి ప్రజాస్వామ్య విలువలే. ఓటు అనే వజ్రాయుధమే శక్తిమంతమైనదని పలుసార్లు దేశ పౌరులు నిరూపించారు. రాబోయే ఎన్నికల్లోనూ ఎక్కువ మంది ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలి..

ప్రజాస్వామ్యమే ఆయుధం..

ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో ఉగ్రమూకలు చెలరేగిపోతూ అమాయక ప్రజల ప్రాణాలు బలితీసుకుంటున్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థ మీద నమ్మకం లేక నియంతృత్వ విధానాలవైపు అడుగులు వేస్తున్నాయి. ఈ తరహా పెడ ధోరణులను అణచివేయాలంటే మన ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. బుల్లెట్టు కన్నా శక్తిమంతమైంది బ్యాలెట్టేనని, ఓటుతోనే మనం తీర్పు చెప్పొచ్చని మరోసారి చాటి చెప్పాలి.

వరుసలో నిలబడి ఓటేస్తే వచ్చేదేంటి? నా ఒక్క ఓటుతోనే ఫలితం ఏం తారుమారు కాదుగా.. ఓటేసేందుకు ఆసక్తి చూపని వారి నుంచి ఇలాంటి మాటలు వింటుంటాం. ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఇప్పటికీ ఎంతో మంది నిర్లక్ష్యం చూపిస్తుంటారు. ఈసారి ఎన్నికల్లో అయినా ప్రభుత్వం ఏర్పాటులో 'నా ఓటు సైతం' అని భావిస్తే పౌరులుగా మన కర్తవ్యం నెరవేర్చినట్టవుతుంది.

నగరాల్లో మరింత పెరగాలి

ఉమ్మడి వరంగల్‌లో ఓటింగ్ సరళిని చూస్తే పల్లెలకన్నా పట్టణ ప్రాంతాల్లో తక్కువగా ఉంటోంది. 2018లో వరంగల్ పశ్చిమలో కేవలం 58.29 శాతం ఓటింగ్ మాత్రమే నమోదయ్యింది. అన్ని నియోజకవర్గాలతో పోలిస్తే నగర ప్రాంతాల్లో ఓటర్లు ఓటు వేసేందుకు ఆసక్తి చూపించడం లేదు. వరంగల్ తూర్పులో 73.47 శాతం నమోదైంది. పల్లె ప్రాంతాలు ఎక్కువగా ఉన్న నర్సంపేటలో ఏకంగా 90.38 శాతం మంది ఓట్లేశారు.

మాజీ మావోలు బ్యాలెట్టు వైపు..

ఉమ్మడి వరంగల్‌లో ఒకప్పుడు మావోయిస్టుల ప్రాబల్యం చాలా ఎక్కువగా ఉండేది. బ్యాలెట్టును నిషేధిస్తూ వారంతా బుల్లెట్టుతోనే మనం అనుకున్నది సాధించాలనే లక్ష్యంతో ఉండేవారు. చాలా మంది మళ్లీ ప్రజాస్వామ్య వ్యవస్థ ద్వారానే ప్రశ్నించాలని, ప్రజాప్రతినిధులుగా నెగ్గి సరైన పాలనతోనే ప్రజల సమస్యలకు పరిష్కారం చూపించాలని దృఢంగా నమ్ముతూ బ్యాలెట్టు వైపు అడుగులు వేస్తున్నారు.

గతంలో జనశక్తిలో పనిచేసిన సీతక్క అలియాస్ ధనసరి అనసూయ అజ్ఞాతం వీడి జనజీవన స్రవంతిలోకి వచ్చి ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొంటున్నారు. గతంలో తెదేపాలో పనిచేసి తర్వాత కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారు. గత ఎన్నికల్లో ములుగు ఎమ్మెల్యేగా గెలుపొంది ప్రజా సమస్యలపై తనదైన గళం వినిపిస్తున్నారు.

ములుగు జిల్లా జడ్పీ తాత్కాలిక ఛైర్‌పర్సన్ బడే నాగజ్యోతి భారాస తరఫున బరిలో నిలవనున్నారు. ఆమె తండ్రి బడే నాగేశ్వరరావు, ఆయన సోదరుడు బడే మురళి దళంలో పనిచేసి పోలీసుల ఎన్‌కౌంటర్‌కు బలయ్యారు.

పరకాల బరిలో కాంగ్రెస్ నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్న గాజర్ల అశోక్ అలియాస్ ఐతు మావోయిస్టుల్లో దండకారణ్యంలో రాష్ట్ర కమిటీ మెంబర్‌గా పనిచేసి తర్వాత లొంగిపోయారు. వీళ్ల పెద్దన్న గాజర్ల సారయ్య అలియాస్ ఆజాద్ సైతం ఎన్‌కౌంటర్‌లో కన్నుమూశారు.

హనుమకొండ జిల్లా టేకులగూడేనికి చెందిన మాచర్ల ఏసోబు అజ్ఞాతంలో ఉన్నారు. ఆయన కొడుకు మాచర్ల మహేశ్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడానికి తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. వర్ధన్నపేట కాంగ్రెస్ టికెట్టు ఆశిస్తున్నారు. ఇలా వీరంతా బుల్లెట్టు కన్నా బ్యాలెట్టుకు ఎక్కువ శక్తి ఉందని నమ్మి వస్తున్నారు.




ఒంగోలు: రాష్ట్ర ప్రజలకు తెదేపా అవసరం ఎంతో ఉందని ఆ పార్టీ అధినేత చంద్రబాబు అన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా నేతలతో ఆయన భేటీ అయ్యారు. ఈసందర్భంగా మాట్లాడారు. "గెలిచే అవకాశం ఉన్న వారికే టికెట్లు ఇస్తాను. అంతర్గతంగా చేయించే సర్వేల్లో నాయకుల పనితీరు బాగాలేకపోతే ఉపేక్షించేది లేదు. ప్రత్యామ్నాయం చూపించి పక్కన పెడతా తప్ప పార్టీ ప్రయోజనాలను ఫణంగా పెట్టను. ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. ఓట్ల అవకతవకల విషయాన్ని ఇన్‌ఛార్జ్‌లు బాధ్యతగా తీసుకోవాలి. అన్నీ పార్టీ అధిష్ఠానం చూసుకుంటుందనే అలసత్వం వద్దు" అని పార్టీ నేతలకు చంద్రబాబు హెచ్చరించారు. అనంతరం గుండ్లకమ్మ ప్రాజెక్టు రెండో గేటు కొట్టుకుపోయిన అంశాన్ని తెదేపా నేతలు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే గేటు కొట్టుకుపోయిందని నేతలు ఆరోపించారు. ఉదయమే సంఘటనాస్థలానికి వెళ్లి.. వారు చేసిన క్షేత్రస్థాయి పరిశీలనను చంద్రబాబుకు నేతలు వివరించారు.

**కలిసి పనిచేద్దాం.. జగన్‌ను ఇంటికి సాగనంపుదాం :** ప్రతి కార్యక్రమంలో తెలుగుదేశం – జనసేన నేతలు కలిసి వేదికను పంచుకోవాలని జనసైనికులకు చంద్రబాబు సూచించారు. క్షేత్రస్థాయిలోనూ కలిసి పనిచేస్తూ జగన్‌ను ఇంటికి సాగనంపుదామని ఆయన పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై గ్రామస్థాయిలోనూ కలసి పోరాడాలని దిశానిర్దేశం చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన నేతలు చంద్రబాబుతో భేటీ అయ్యారు. తెలుగుదేశం – జనసేన నిర్వహించే కార్యక్రమాల్లో నేతలు సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని చంద్రబాబు వారితో అన్నారు.

# సింహాచలం స్టేషన్‌కు 'అమృత' భాగ్యం!



విశాఖపట్నం : సింహాచలం రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులకు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ శనివారం ప్రారంభించారు. అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్‌లో రూ.20 కోట్లతో రైల్వే శాఖ సింహాచలం స్టేషన్ అభివృద్ధి పనులను చేపట్టింది. అభివృద్ధి పనుల ప్రారంభం సందర్భంగా రైల్వే మంత్రి మాట్లాడుతూ విజయనగరం జిల్లా కంటకాపల్లి రైల్వే ప్రమాదం మానవ తప్పిదం వల్లే జరిగిందన్నారు. ఈ ఘటనపై ఇంకా విచారణ కొనసాగుతోందని చెప్పారు. 'త్వరలో మరిన్ని వందే భారత్ రైళ్లు పట్టాలెక్కనున్నాయి. వారానికి ఒక వందే భారత్ రైలు నిర్మాణం జరుగుతోంది. రైల్వేలను రాజకీయాలతో ముడిపెట్టి చూడొద్దు. ఏపీలో రైల్వేల అభివృద్ధి కోసం 8వేల 406కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాం. భూ కేటాయింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. దేశంలో 5జీ మొబైల్ సర్వీసుల విస్తరణ చాలా వేగంగా జరుగుతోంది. దీపావళి నాటికి బీఎస్ఎన్ఎల్ 5జీ సేవలు అందుబాటులోకి వస్తాయి. నాలుగువేల నూతన సెల్ ఫోన్ టవర్లు ఏర్పాటవుతున్నాయి. ఇందులో ఎక్కువ ఉత్తరాంధ్రలోనే నిర్మాణం జరుగుతున్నాయి'అని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

# రేవంత్‌ను చూసైనా జగన్ సిగ్గుపడాలి



అమరావతి: ఏపీ సీఎం జగన్ మోహన్‌రెడ్డిపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని చూసైనా ఏపీ సీఎం జగన్ సిగ్గుపడాలన్నారు. రేవంత్ సీఎం కాగానే ప్రగతి భవన్ ముందు బారికేడ్లు తొలగించి ప్రజాదర్బార్ ఏర్పాటు చేశారన్నారు. జగన్ ముఖ్యమంత్రి కాగానే రూ.9 కోట్ల ప్రజాధనంతో నిర్మించిన ప్రజా వేదిక కూల్చేశారని మండిపడ్డారు. జగన్ నియంతలా వ్యవహరిస్తూ రాష్ట్రంలో విధ్వంసక పాలన చేస్తున్నారన్నారు. జగన్ పర్యటనలన్నీ పోలీసుల మోహరింపుల మధ్య, పరదాలు, ముళ్లకంచెల మాటున సాగుతున్నాయన్నారు.

గత నాలుగున్నర ఏళ్లలో ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు, ప్రజలు కలిసేందుకు జగన్ అనుమతించలేదని విమర్శించారు. తమిళనాడు సీఎం స్టాలిన్ ఇప్పటికీ కూడా గత ముఖ్యమంత్రి జయలలిత పేరుతోనే పలు కార్యక్రమాలు కొనసాగించడం గమనార్హమన్నారు. జగన్మోహన్ రెడ్డి ఇప్పటికైనా తన వైఖరిలో మార్పు తెచ్చుకుని, ప్రజారంజకంగా పాలన చేయాలని రామకృష్ణ హితవుపలికారు.

# వైసీపీ ప్రభుత్వ అసమర్థతను టీడీపీకి అంటగడతారా?



అమరావతి: జగన్ రెడ్డి పత్రిక సాక్షివన్నీ అబద్ధపు, తప్పుడు రాతలే అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు మండిపడ్డారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ అసమర్ధతను టీడీపీకి అంటగడతారా అని ప్రశ్నించారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేటు కొట్టుకుపోవడానికి టీడీపీ ప్రభుత్వమే కారణమనడం సిగ్గుచేటన్నారు. ప్రాజెక్టుల నిర్వహణను జగన్ రెడ్డి గాలికొదిలేశారని విమర్శించారు. జగన్ రెడ్డి సోమరితనంతో గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు ఊడి నీరు వృథాగాపోతందోన్నారు. తాడేపల్లి ప్యాలెస్ నుంచి బయటకు రాకుండా తమపై నిందలా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. టీఎంసీ – క్యూసెక్కుకి తేడా తెలియని వారికి నీటిపారుదల శాఖ కట్టబెట్టారన్నారు. ప్రభుత్వ తీరు మారకపోతే ప్రాజెక్టుల దగ్గర ఆందోళనలు చేపడతామని అచ్చెన్నాయుడు హెచ్చరించారు.




న్యూయార్క్: ఇజ్రాయెల్–హమాస్ మధ్య భీకరపోరు సాగుతోంది. ఈ దాడులతో గాజాలోని సామాన్య ప్రజల బతుకు ఛిద్రమవుతోంది. ఈ క్రమంలో గాజాలో తక్షణమే కాల్పులు విరమణ జరగాలని ఐరాస భద్రతా మండలి డిమాండ్‌ను అమెరికా వ్యతిరేకించింది. అందుకోసం తన వీటో పవర్‌ను ఉపయోగించింది. గాజాలో తక్షణమే కాల్పుల విరమణ కోసం భద్రతా మండలిలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రతిపాదించిన ముసాయిదాకు 13 మంది అనుకూలంగా ఓటేశారు. బ్రిటన్ ఓటింగ్‌కు దూరం జరిగింది. గాజాలో మానవతా సంక్షోభ నివారణ నిమిత్తం ఇటీవల ఐరాస చీఫ్ ఆంటోనియో గుటెరస్ అసాధారణ అధికారాన్ని ఉపయోగించారు. యూఎన్ ఛార్టర్‌లోని ఆర్టికల్ 99ను ప్రయోగించారు. ఈ ప్రత్యేక అధికారంతో అంతర్జాతీయంగా ఆందోళనలను కలిగించే పరిస్థితుల్లో భద్రతా మండలిని సమావేశపరచవచ్చు. దీనిలో భ్నాగంగా సమావేశమైన మండలిలో ఓటింగ్ జరిగింది. అయితే మండలిలో శాశ్వత సభ్యదేశమైన అమెరికా తన వీటో అధికారంతో తీర్మానాన్ని అడ్డుకుంది. మండలిలో మొత్తం 15 సభ్య దేశాలు ఉన్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు కాల్పుల విరమణను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. అది హమాస్ పుంజుకునేందుకు ఉపయోగపడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అయితే గాజాలో పౌరుల రక్షణ కోసం, బందీల విడుదల కోసం యుద్ధంలో స్వల్ప విరామాలకు మాత్రం అమెరికా అనుకూలంగా ఉంది. ఆ దేశ ప్రతినిధి రాబర్ట్ వుడ్ మాట్లాడుతూ.. 'ఈ తీర్మానం వాస్తవికతకు దూరంగా ఉంది. దానివల్ల క్షేత్రస్థాయిలో ఎలాంటి ప్రభావం ఉండదు. ఇజ్రాయెల్, పాలస్తీనా ప్రజలు శాంతి, భద్రతల మధ్య జీవించాలని అమెరికా బలంగా కోరుకుంటోంది. అయితే ఈ అస్థిరమైన కాల్పుల విరమణకు అంగీకరిస్తే.. హమాస్ మరో యద్ధానికి ప్రణాళిక రచిస్తుంది. శాంతిపై, రెండు దేశాల సిద్ధాంతంపై హమాస్‌కు విశ్వాసం లేదు' అని అన్నారు. ప్రస్తుత ముసాయిదాలో సవరణలు చేయాలని అమెరికా సూచించింది. అక్టోబర్ ఏడున ఇజ్రాయెల్‌పై హమాస్ దాడిని ఖండించాలని డిమాండ్ చేసింది. ఆ నరమేధంలో 1200 మంది అసువులుబాసారు. 240 మంది బందీలుగా మారారని ఇజ్రాయెల్ వెల్లడించిన సంగతి తెలిసిందే. హమాస్ చర్యల పట్ల ఎలాంటి ఖండన లేకపోవడంతో ఓటింగ్‌కు దూరమయ్యామని బ్రిటన్ తెలిపింది.




అభివృద్ధి చెందిన దేశాల సరసన భారత్ చేరాలంటే దేశ యువత వారానికి 70 గంటల చొప్పున పనిచేయాలంటూ ఇటీవల ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై నెట్టింట పెద్ద ఎత్తున చర్చ జరిగింది. పారిశ్రామికవేత్తలు, టెక్ సీఈవోలు కూడా దీనిపై స్పందిస్తూ భిన్నమైన అభిప్రాయాలను వ్యక్తపర్చారు. తాజాగా నారాయణమూర్తి మరోసారి పనివేళలపై మాట్లాడుతూ తన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. "పేదరికం నుంచి తప్పించుకోవడానికి మనకున్న ఏకైక మార్గం కష్టపడి పనిచేయడమే అని నా తల్లిదండ్రులు నాకు చిన్నప్పుడే నేర్పించారు. నా 40 ఏళ్ల వృత్తి జీవితంలో నేను అదే పాటించా. ఉదయం 6.20 గంటలకే ఆఫీసుకు వెళ్లి.. మళ్లీ రాత్రి 8.30 గంటలకు ఇంటికి వచ్చేవాడిని. వారానికి 70 గంటలు పైనే పనిచేశా. 1994 వరకు మాకు వారానికి ఆరు పనిదినాలు ఉండేవి. అప్పుడైతే వారానికి కనీసం 85–90 గంటలు పనిచేసేవాడిని. ఆ కష్టం వృథా కాలేదు" అని ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో నారాయణ మూర్తి వెల్లడించారు. కొద్దిరోజుల క్రితం ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్ఓ మోహన్‌దాస్ పాయ్ వ్యాఖ్యాతగా వ్యవహరించిన 'ది రికార్డ్' అనే పాడ్‌కాస్ట్ తొలి ఎపిసోడ్‌లో మాట్లాడిన నారాయణ మూర్తి.. ప్రపంచ దేశాలతో పోలిస్తే భారత్‌లో ఉత్పాదకత తక్కువని అన్నారు. అందుకే దేశ యువత మరిన్ని గంటలు అధికంగా శ్రమించాలన్నారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత జపాన్, జర్మనీ వంటి దేశాలు ఎలాగైతే కష్టపడ్డాయో.. మనమూ అలా శ్రమించాలని అన్నారు. అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడాలంటే భారత్‌లోని యువత వారానికి 70 గంటల పాటు పనిచేయాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. దీనిపై మిశ్రమ స్పందనలు వ్యక్తమయ్యాయి. కొందరు ఉద్యోగ జీవితంలో ఉండే ఇబ్బందులను లేవనెత్తగా.. మరికొందరు బాస్‌లు మాత్రం నారాయణ మూర్తి అభిప్రాయాన్ని స్వాగతించారు.

# ఉల్లిపాయ - బంగాళాదుంపకు తేడా తెలియని వ్యక్తి రాష్ట్రానికి సీఎం.. దేవినేని ఎద్దేవా



విజయవాడ: రాష్ట్రంలో వ్యవసాయ భూములకు సాగు నీరు అందించడంలో వైసీపీ విఫలం అయ్యిందని.. ఓ ప్రణాళిక లేకపోవడమే దీనికి కారణమని మాజీ మంత్రి దేవినేని ఉమ విమర్శలు గుప్పించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. మూడు రోజుల క్రితం కురిసిన వర్షానికి, తుఫాన్ ప్రభావంతో అన్ని రకాల పంటలు నాశనం అయ్యాయన్నారు. ఉల్లిపాయకి.. బంగాళాదుంపకి తేడా తెలియని వ్యక్తి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారని ఎద్దేవా చేశారు. 8 మంది కౌలు రైతులు చనిపోయారన్నారు. మూడు నెలల్లో తెలుగుదేశం అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

నీట మునిగిన పంటను చూడడానికి వెళ్తే తమ దగ్గరికి పోలీసులు వచ్చి ఫొటోలు తీస్తున్నారన్నారు. అప్పులు చేసి పంట వేస్తే నోటి దగ్గరకు వచ్చిన పంట నాశనం అయ్యిందన్నారు. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని దేవినేని ఉమా పేర్కొన్నారు.




ఢిల్లీ: 'అస్సాం'పై సీనియర్ న్యాయవాది, ఎంపీ కపిల్ సిబల్ చేసిన వ్యాఖ్యలు కొత్త వివాదానికి తెరలేపాయి. సుప్రీంకోర్టులో ఓ కేసు విచారణ సందర్భంగా.. 'అస్సాం ఒకప్పుడు మయన్మార్‌లో భాగమే' అంటూ సిబల్ వ్యాఖ్యానించారు. దీంతో ఇది కాస్తా రాజకీయ దుమారం రేపింది. ఈ వ్యాఖ్యలపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తీవ్రంగా మండిపడ్డారు. 1955 పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 6ఏ చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానం ఇటీవల విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కపిల్ సిబల్ తన వాదనలు వినిపిస్తూ.. "వలసలపై ఎలాంటి రికార్డులు ఉండవు. ఒకవేళ మీరు అస్సాం చరిత్రను చూసినట్లయితే.. ఎవరు ఎప్పుడు వచ్చారనేది గుర్తించడం అసాధ్యమని మనకు అర్థమవుతుంది. వాస్తవానికి అస్సాం ఒకప్పుడు మయన్మార్‌లో భాగం. 1824లో బ్రిటిష్ వారితో చేసుకున్న ఒప్పందంలో భాగంగా అస్సాంను మయన్మార్.. వారికి అప్పగించింది" అని వ్యాఖ్యానించారు. కపిల్ వాదనలకు సంబంధించిన జాతీయ మీడియాల్లో కొన్ని కథనాలు రావడంతో ఇది కాస్తా వివాదాస్పదంగా మారింది. ఈ నేపథ్యంలోనే అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ తాజాగా స్పందిస్తూ.. సిబల్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. "అస్సాం చరిత్ర గురించి తెలియని వారు.. మా రాష్ట్రం గురించి మాట్లాడొద్దు. అస్సాం ఎప్పుడూ మయన్మార్‌లో భాగం కాదు. కొంతకాలం పాటు దీని గురించి గొడవలు జరిగాయి. అంతే తప్ప.. అస్సాం మయన్మార్‌లో భాగమేనంటూ చెప్పే ఏ డేటాను ఇంతవరకూ నేను చూడలేదు" అంటూ సీఎం ఘాటుగా బదులిచ్చారు.

# రైతులను చాలా నిర్లక్ష్యంగా గాలికొదిలేశారు



విజయవాడ: మిచౌంగ్ తుపాను రాష్ట్ర రైతాంగాన్ని అతలాకుతలం చేసిందని టీడీపీ ఎంపీ కేశినేని నాని అన్నారు. అన్ని పంటలతో పాటు పూత మీద మామిడి కూడా దెబ్బ తిన్నదన్నారు. కొన్ని లక్షల ఎకరాల్లో పంట దెబ్బ తిని వరి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఎకరానికి 40 నుంచి 50 వేల ఎకరాలు నష్టపోయారన్నారు. రైతులను ఆదుకోవడంలో జగన్ సర్కార్ పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. హుద్ హుద్ తుఫాన్ సమయంలో చంద్రబాబు అక్కడే ఉండి ప్రజలకు ధైర్యం ఇచ్చారని కేశినేని నాని గుర్తు చేశారు. ఈ రోజు చాలా నిర్లక్ష్యంగా రైతులను గాలికొదిలేసిందన్నారు. ఇటువంటి ప్రభుత్వం ఉండడానికి వీల్లేదన్నారు. కేంద్రంలో ఆదుకోమని టీడీపీ ఎంపీలు పార్లమెంట్‌లో డిమాండ్ చేశారన్నారు. ముందుగా 5 వేల కోట్లు విడుదల చేయాలని టీడీపీ ఎంపీలు కోరారని కేశినేని నాని తెలిపారు. కేంద్ర మంత్రిని రాష్ట్రంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించాలని కోరామన్నారు. రైతులను చంద్రబాబు ఆదుకుంటామని స్పష్టమైన హామీ ఇచ్చారన్నారు. ఢిల్లీ నుంచి గల్లీ దాకా తమ ప్రయత్నాలు తాము చేసి రైతులను ఆదుకుంటామన్నారు. విజయవాడ శివారులో తాగు నీటి సమస్య ఉందన్నారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలంలో ప్రతి గ్రామానికి నీటి ట్యాంకర్ల పంపిణీ చేశామన్నారు. ఇప్పటిదాకా 120 న్యూటి ట్యాంకర్ల ఇచ్చామని.. ఇంకా నీటి ఎద్దడి ఉన్న గ్రామాలకు ఇస్తామన్నారు. 13 కోట్లు తాగు నీటి సమస్య పరిష్కారానికి ఖర్చు చేస్తున్నామన్నారు. ఏ ఎంపీ చేయనటువంటి కార్యక్రమం చేయడం తన అదృష్టమని.. చంద్రబాబు, ఎన్టీఆర్ స్ఫూర్తితో ముందుకు వెళతామని కేశినేని నాని తెలిపారు.

# తుపాను బాధితులకు ప్రభుత్వం 25వేల ఆర్థిక సాయం అందించాలి: చంద్రబాబు



బాపట్ల: తుపాను ప్రభావిత ప్రాంతాల్లో తెదేపా అధినేత చంద్రబాబు రెండో రోజు పర్యటన కొనసాగుతోంది. శనివారం జమ్ములపాలెం ఎస్టీ కాలనీలో ఆయన పర్యటించారు. తుపాను వల్ల సర్వం కోల్పోయామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా లేక నాలుగు రోజులు చీకట్లోనే గడిపామని కాలనీ వాసులు తమ బాధను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. కాలనీలో రహదారి లేక రోజులు తరబడి బురదలోనే గడిపామని స్థానికులు వాపోయారు. ఆదుకునేందుకు ప్రభుత్వం నుంచి ఎవరూ రాలేదని కాలనీ వాసులు ఆరోపించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులకు చంద్రబాబు నిత్యావసరాల కిట్లు పంపిణీ చేశారు. బాధితులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. "ఎస్టీ కాలనీలో ఎక్కడ చూసినా వరద నీరే. నాలుగు రోజులు మీరంతా నీళ్లలోనే ఉన్నారు. బాపట్ల జిల్లా కేంద్రంలోనే ఇంత దారుణ పరిస్థితులు ఉండటం దుర్మార్గం. తెదేపా (%ఱఖా%) తరఫున ఒక్కో ఇంటికి ?5వేల సాయం అందిస్తున్నాం. ప్రభుత్వం ఒక్కొక్క కుటుంబానికి ?25వేలు చొప్పున ఆర్థిక సాయం అందించాలి. గత ఎన్నికల్లో తెదేపాకు ఓటు వేశారనే కాలనీ వాసులపై కక్షగట్టారు" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

# దిశా కాదు బార్బీ బొమ్మ

వేదిక ఏదైనా కానీ దిశా పటానీ ఎప్పుడూ షో స్టాపర్ గా నిలుస్తుంది. తాజాగా పింక్ మినీ డ్రెస్ లో దిశా పటానీ హొయలు అభిమానుల్లో గుబులు పుట్టించాయి. ముంబైలో ఒక ప్రయివేట్ ఈవెంట్‌లో దిశా పటానీ లుక్ ట్రెండ్ సెట్టర్ గా నిలిచింది. మరింత డీప్ గా వివరాల్లోకి వెళితే. వినోద పరిశ్రమలో బోల్డ్ బ్యూటీగా దిశా పటానీకి గుర్తింపు ఉంది. క్యాట్ వాక్ లతో నిరంతరం వేదికలపై హొయలు పోయే దిశా అభిమానులను ఊపిరి పీల్చుకునే అవకాశాన్ని కూడా ఇవ్వదు. చీరలో అయినా .. ఏదైనా క్యాజువల్స్ లుక్ లేదా బికినీలో స్విమ్ సూట్ లో కనిపించినా.. దిశా తన అందమైన వేషధారణతో అభిమానుల హృదయాల్లో అగ్గి రాజేస్తుంది. తాజాగా ఓ ప్రయివేట్ ఈవెంట్ లో దిశా లుక్ కి 'వావ్' అంటూ స్టన్ అయ్యారు ఫ్యాన్స్. ఈ వేడుకలో పింక్ స్ట్రెచ్-నిట్ మినీ డ్రెస్‌లో దిశా పటానీ సంథింగ్ స్పెషల్ గా కనిపించింది. పాపులర్ క్రియేటివ్ ఫెస్ట్ ఈవెంట్‌లో దిషా పటానీ కెమెరా కళ్లకు స్టైల్‌గా పోజులిచ్చింది. దిశా అందమైన గులాబీ రంగు దుస్తులు ముందు భాగంలో రెండు లవ్ ఈమోజీ అలంకారాలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్ట్రెచ్-నిట్ మినీ డ్రెస్‌లో




హ్యాండ్ కవర్-అప్ డిటైలింగ్ తో ఈ డ్రెస్ ప్రత్యేకంగా కనిపించింది. ఈ అందమైన పింక్ మినీ డ్రెస్‌ని ధరించినప్పుడు దిశా పటానీ బార్బీలా కనిపించిందంటూ అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. దిశా మినిమల్ యాక్సెసరీస్‌ని ఎంచుకున్నప్పటికీ, ఆమె క్లాస్ పెయిర్ స్టోన్-స్టడెడ్ టై-అప్ హీల్స్ ఆ రూపానికి వన్నె తెచ్చాయి. దిశా పటానీ పింక్ మినీ డ్రెస్ ధర రూ. 70,000. దిశా దుస్తులు బ్రాండ్, మాక్ అండ్ మ్యాక్ నుండి ఎంపిక చేసుకున్నవి. ఈ డ్రెస్ 780 యూరోల ధర ట్యాగ్‌తో వస్తుంది. దేశీ కరెన్సీలో దీని విలువ దాదాపు రూ. 70,116. నట వృత్తి పరంగా చూస్తే... దిశా మరోసారి తన మాజీ టైగర్ ష్రాఫ్ సరసన నటించనుంది. దర్శకనిర్మాత జగన్ శక్తి తదుపరి చిత్రం 'హీరో నంబర్ 1'లో ఒక కథానాయికగా నటిస్తోంది. మొదట్లో సారా అలీ ఖాన్‌ను ఈ పాత్రకు ఎంపిక చేశారు. కానీ సారా స్థానంలో దిశా వచ్చి చేరింది. హీరో నంబర్ 1లో ఇద్దరు హీరోయిన్లు నటించనున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో హృతిక్ రోషన్ కజిన్ పష్మీనా రోషన్ టైగర్ ప్రేమికురాలిగా నటించనుంది. ఈ ప్రాజెక్ట్ డేవిడ్ ధావన్ దర్శకత్వం వహించిన హీరోనం.1 కి సీక్వెల్ కాదని తెలిసింది. 1997లో గోవింద-నటించిన చిత్రానికి రీమేక్ లేదా సీక్వెల్ కాదు. ఈ చిత్రాన్ని జాకీ భగ్నాని ప్రొడక్షన్ హౌస్ నిర్మిస్తోంది. సిద్ధార్థ్ మల్హోత్రా తో కలిసి నటించిన 'యోధా' విడుదలకు సిద్ధమవుతోంది. మరోవైపు మోహిత్ సూరితో కలిసి భారీ యాక్షన్ ఎంటర్ టైనర్ లో దిశా పటానీ నటించనుందని తాజాగా వార్త అందింది. ఇటు టాలీవుడ్ లో పలు క్రేజీ పాన్ ఇండియా ప్రాజెక్టుల్లోను దిశా నటిస్తోందని కథనాలొస్తున్న సంగతి తెలిసిందే. కానీ వాటి గురించి అధికారికంగా సమాచారం లేదు.

## మీనాక్షి చౌదరి మరోకటి పట్టేసిందా?

యంగ్ హీరోయిన్ మీనాక్షి చౌదరి పేరు ఇప్పుడు టాలీవుడ్ లో హాట్ టాపిక్ గా మారిన సంగతి తెలిసిందే. రష్మిక మందన్న..పూజాహెగ్డే లాంటి భామలు ముంబైలో తిష్ట వేయడం..సమంత అమెరికాలో రిలాక్స్ అవ్వడం తో దర్శక నిర్మాతలకు మీనాక్షి ప్రత్యామ్నాయంగా కనిపిస్తుంది. వాళ్ల రేంజ్ లో పారితోషికం కూడా డిమాండ్ చేయదు కాబట్టి! మీనాక్షి వైపు అంతా చూస్తున్నారు. అన్నింటిని మంచి మంచి పెర్ఫార్మర్ అని త్రివిక్రమ్ లాంటి ఉద్దండులే స్టాప్ వేయడంతో దర్శకుడు మీనాక్షి పేరు చెప్పగానే మరో ఆలోచన లేకుండా హీరో-నిర్మాతలు అంగీకరిస్తున్నారు. 'గుంటూరు కారం'లో మహేష్ కి జోడీగా ఎంపిక చేయడంతో అమ్మడి పేరు మరింత పాపులర్ అవుతుంది. ఇదే క్రేజ్ ని అమ్మడు తెలివిగా సద్వినియోగం చేసుకుంటుంది. చిన్న..పెద్ద అనే తేడా లేకుండా సినిమాలు కమిట్ అవుతుంది. తాజాగా మీనాక్షి చౌదరి మరో భారీ ప్రాజెక్ట్ లోనూ



భాగం అవుతున్నట్లు వినిపిస్తుంది. ప్రస్తుతం నటసింహ బాలకృష్ణ కథానాయకుడిగా బాబి దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇందులో మొత్తం ముగ్గురు నాయికలు అవసరం ఉంది. దీంతో ఓ పాత్రకి మీనాక్షి చౌదరని ఎంపిక చేసినట్లు సమాచారం. మరో నాయికగా ఊర్వశి రౌతేలాని కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఊటీలో షూటింగ్ జరుగుతోన్న నేపథ్యంలో బాలయ్య ..ఊర్వశిలపై కొన్ని కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. దీంతో ఊర్వశి ఎంట్రీ కన్ఫమ్ అయింది. మరో నాయిక ఎవరు? అన్నది తెలియాల్సి ఉంది. అలాగే మీనాక్షి ఎంట్రీని మేకర్స్ ధృవీకరించాల్సి ఉంది. ఈ ఛాన్స్ గనుక మీనాక్షి చౌదరి అందుకుంటే? అమ్మడు స్టార్ లీగ్ లో చేరినట్లే. ఓవైపు 'గుంటూరు కారం'..మరోవైపు బాలయ్య సినిమాలో రొమాన్స్ చేస్తే! అంతకు మించిన గొప్ప ఐడెంటిటీ ఇంకేముంటుంది. ఆ రెండు విజయాలు సాధిస్తే మీనాక్షి సైతం శ్రీలీలలా టచ్ చేయని రేంజ్ కి చేరుకుంటుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు.




# పోగొట్టుకోవడానికి ఏమీ లేదు.. సర్వం కోల్పోయాను: రియా





"పోగొట్టుకోవడానికి ఏమీ లేదు.. నేను అన్నింటినీ కోల్పోయాను" అంటూ నర్మగర్భ వ్యాఖ్యలు చేసింది రియా చక్రవర్తి. ఈ వ్యాఖ్యల అనంతరం రియా తన యోగా సెషన్స్ నుంచి షేర్ చేసిన ఒక వీడియో అంతర్జాలంలో వైరల్ గా మారింది. రియా తన లైఫ్‌లో అన్నీ కోల్పోయాననే నిరాశతో ఉందా? అంటే... నిరాశను జయించేందుకు ఇలా యోగా ధ్యానాన్ని ఆశ్రయిస్తోంది.. నెమ్మదిగా కంబ్యాక్ అవుతోంది! అంటూ నెటిజనులు సోషల్ మీడియాల్లో వ్యాఖ్యానిస్తున్నారు. కొందరు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మరణం తర్వాత రియా తాను సర్వం కోల్పోయానని భావిస్తోందా? అంటూ సందేహం వ్యక్తం చేసారు. ప్రియుడు సుశాంత్ సింగ్ మరణించిన తర్వాత రియాను నెటిజనులు సోషల్ మీడియాలో వెంటాడి వేటాడారు. అతడితో ఆమెకు ఉన్న సంబంధానికి పేర్లు పెట్టారు. రకరకాల ఆరోపణలు చేసారు. సుశాంత్ సింగ్ బలవన్మరణంలో ఆమె పాత్రను ప్రశ్నించారు. అరెస్టులు, జైలు జీవితం వగైరా తెలిసిన వ్యవహారాలే. అయితే రియా చక్రవర్తి జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నప్పటికీ మరింత బలంగా తిరిగి కంబ్యాక్ అయ్యేందుకు ప్రయత్నిస్తోంది. వ్యక్తిగత జీవితంపై ఎన్ని విమర్శలు ఎదురైనా కానీ.. రియా మానసికంగా దృఢంగా ఉండాలని భావించింది. తన మార్గంలో వచ్చిన ప్రతి వార్ ని బలమైన మనస్సుతో ఎదుర్కొంది. తాజాగా భయం గురించి మాట్లాడిన రియా మళ్లీ చర్చనీయాంశమైంది. 14 జూన్ 2020న మరణించిన సుశాంత్ సింగ్ రాజ్‌పుత్‌తో అప్పటికే రియా రిలేషన్‌షిప్‌లో ఉన్న సంగతి తెలిసిందే. అతడి మరణం రియా చక్రవర్తిని చాలా ఇబ్బందులకు గురి చేసింది. ఇటీవలి ఇంటర్వ్యూలో ఇలాంటి భయాల గురించి రియా చక్రవర్తి మాట్లాడుతూ, సినిమా జీవితంలా ..కిసీ కో ఇత్నా భీ మ్సత్ దారో కి ఉంక దర్ ఖతం హోజాయే.. అని వ్యాఖ్యానించింది. నా విషయంలో నా కుటుంబం విషయంలో చాలా భయపడాల్సిన అవసరం ఉందని నేను అనుకున్నాను. కానీ ఒక పాయింట్ తర్వాత నిర్భయంగా మారానని మీకు తెలుసు. మీరు ఆ స్థాయికి నన్ను కిందికి లాగారు కానీ మీకు తెలిసిందేమీ లేదు. ఇప్పుడు నేను కోల్పోవడానికి ఏమీ లేదు.. నేను అన్నింటినీ కోల్పోయాను.." అని ఆవేదనను కనబరిచింది. "నేను ప్రతిష్టను కోల్పోయాను.. నేను ప్రియమైన వ్యక్తిని కోల్పోయాను.. ఇప్పుడు జైలులో ఉన్న నా సోదరులను మిస్సయ్యాను.. ఇప్పుడు నేను జైలుకు వెళుతున్నాను.. నా తల్లిదండ్రులు అనారోగ్యంతో ఉన్నారు.. ఇంతకంటే ఇంకేం కావాలి మీకు? కాబట్టి అన్నిటి నుంచి ఒక స్థితి స్థాపకత నాకు అలవడింది. నా సహనం ఎక్కడ ఎప్పుడు ఎలా రావాలో అక్కడ వస్తుంది. అక్కడ దేవుడిపై నమ్మకం లేదా దైవిక శక్తిపై నమ్మకం వస్తుంది. కాబట్టి అప్పటి వరకు ఎవరైనా భయపడుతారని నేను భావిస్తున్నాను. కానీ ఒక నిర్దిష్ట స్థాయికి మించి ఎవరూ వెళ్లలేరు. బంగీ జంప్‌ని ఉదాహరణగా తీసుకోండి. మీరు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తూ పైకి ఎక్కినప్పుడు మీ ఆడ్రినలిన్‌లో పంపింగ్ పెరుగుతుంది. మీరు మొదటి అడుగు వేసిన తర్వాత మీరు చాలా ఆందోళన చెందుతారు. నిజానికి ఆ తర్వాత నెమ్మదిగా భయం పోతుంది! జీవితం కూడా అంతే.. అని తాత్వికంగా మాట్లాడింది రియా. రియా తన జీవితంలో ఎదుర్కొన్న సంఘటనల గురించి ఓపెనవ్వడం ఇదే మొదటిసారి కాదు. గతంలో తనపై ప్రతికూలత గురించి, జైలు జీవితం సహా తాను అనుభవించిన కఠినంగా గడిచిన గత నాలుగు సంవత్సరాల వ్యథ గురించి ఓపెనైంది. రియా నెమ్మదిగా కోలుకుంటూ పాజిటివ్ ధృక్పథంతో.. స్థిరంగా ప్రజల హృదయాలలో మనస్సులలో ఒక ముద్ర వేసింది. కెరీర్ మ్యాటర్ కి వస్తే... టీవీ షోలతో బిజీగా ఉంది. రియా చక్రవర్తి టాలీవుడ్ లో సుమంత్ అశ్విన్ సరసన తూనీగ తూనీగ చిత్రంలో నటించిన సంగతి తెలిసిందే.

# నా సామి రంగ.. నాగ్ పక్కా లోకల్ మాస్




అక్కినేని నాగార్జున సంక్రాంతిని టార్గెట్ చేస్తూ నా సామి రంగ అనే సినిమాను విడుదల చేయబోతున్న విషయం తెలిసిందే. ఇక ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్ హడావుడి కూడా మొదలైపోయింది. తప్పకుండా పొంగల్ బరిలో ఈ సినిమా సక్సెస్ అవుతుంది అని చిత్ర యూనిట్ ఎంతో నమ్మకంతో కనిపిస్తోంది. ఇక సినిమాకు సంబంధించిన పాటలను కూడా విడుదల చేస్తూ ఉన్నారు. ఈ సినిమాకు ఎం ఎం కీరవాణి సంగీతం అందిస్తున్న విషయం తెలిసిందే. నా సామి రంగ సినిమాలో నాగార్జున నెవెర్ బిఫోర్ అనేలా కనిపించబోతున్నట్లు అర్థమవుతుంది. గతంలోనే బంగార్రాజు సోగ్గాడే చిన్నినాయన వంటి సినిమాల్లో పక్క పల్లెటూరి మాస్ హీరోగా కనిపించిన నాగార్జున ఈసారి మరింత డిఫరెంట్ గా ఆ రూట్లో ఆకట్టుకోబోతున్నట్లుగా అనిపిస్తోంది. రీసెంట్గా సినిమాకు సంబంధించిన ఒక పోస్టర్ కూడా విడుదల చేశారు. అందులో స్టైలిష్ హెయిర్ స్టైల్ తో నాగార్జున పల్లెటూరి ట్రాక్టర్ పై కాలు పెట్టి లుంగీలో కనిపిస్తూ ఉన్నాడు. మరోసారి పల్లెటూరి వాతావరణానికి తగ్గట్టుగా పర్ఫెక్ట్ మాస్ ఎలిమెంట్స్ నాగార్జున నుంచి చూడబోతున్నట్లుగా ఈ పోస్టర్ చూస్తేనే క్లియర్ గా అర్థమవుతుంది. ఇక రీసెంట్ గా ఎత్తుకెళ్లిపోవాలనిపిస్తుంది అనే పాటకు సంబంధించిన మ్యూజిక్రోమో కూడా విడుదల చేశారు. అయితే ఈ పోస్టర్ ద్వారా లిరికల్ ప్రోమో కూడా విడుదల చేయబోతున్నట్లు క్లారిటీ ఇచ్చారు. ఎంఎం కీరవాణి మ్యూజిక్ ఈ సినిమాలో ప్రత్యేక ఆకర్షణగా ఉండబోతున్నట్లుగా తెలుస్తోంది. చాలా కాలం తర్వాత ఆయన నాగార్జున సినిమాకు మ్యూజిక్ అందిస్తూ ఉండడం విశేషం. గతంలో వీరి కలయికలో వచ్చిన అన్నమయ్య శ్రీరామదాసు నేనున్నాను వంటి సినిమాలు మ్యూజికల్ గా ఏ స్థాయిలో గుర్తింపు అందుకున్నాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇక ఇప్పుడు నా సామి రంగా సినిమా నుంచి కూడా బెస్ట్ మ్యూజిక్ రాబోతున్నట్లుగా తెలుస్తోంది. ఈ సినిమాలో ఆశికా రంగనాథ్ నాగార్జునకు జోడిగా కనిపించబోతోంది.

విజయ్ దీన్ని దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో రాజ్ తరుణ్ అల్లరి నరేష్ కూడా ప్రత్యేకమైన పాత్రలలో కనిపించబోతున్నారు మరి ఈ సినిమాతో నాగార్జున సంక్రాంతి బాక్సాఫీస్ వద్ద ఎలాంటి కలెక్షన్స్ అందుకుంటాడో చూడాలి.

# అమ్మపై విమర్శలు నా హృదయాన్ని విచ్ఛిన్నం చేశాయి

చిన్న వయసులోనే హీరోయిన్ గా దేశ ముదురు సినిమాలో నటించి అందంతో పాటు అభినయంతో మెప్పించిన ముద్దుగుమ్మ హన్సిక మోత్వానీ. ఈ అమ్మడు సుదీర్ఘ కాలంగా ఇండస్ట్రీ లో కొనసాగుతూ స్టార్ డమ్ దక్కించుకుంది. ఈ మధ్య కాలంలో టాలీవుడ్ కంటే కోలీవుడ్ లో ఎక్కువగా సందడి చేస్తోంది. కోలీవుడ్ లో లేడీ ఓరియంటెడ్ సినిమాలకు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ గా నిలిచిన ముద్దుగుమ్మ హన్సిక చేతిలో మంచి ఆఫర్లు ఉన్న సమయంలోనే పెళ్లి చేసుకుని కొత్త జీవితంను మొదలు పెట్టింది. సాధారణంగా సౌత్ సినీ ఇండస్ట్రీలో పెళ్లి అయిన హీరోయిన్స్ కి ఆఫర్లు తగ్గుతాయి. కాని హన్సిక పెళ్లి అయిన తర్వాత కూడా బిజీగానే ఉంది. ఇటీవలే తన భర్తతో కలిసి మొదటి వివాహ వార్షికోత్సవం జరుపుకున్న ముద్దు



గుమ్మ హన్సిక ఒక ఇంటర్వ్యూలో గతంలో తనపై. మరియు తన తల్లిపై వచ్చిన విమర్శలపై స్పందించింది. స్కిన్ స్పెషలిస్ట్ అయిన హన్సిక తల్లి పై అప్పట్లో మీడియాలో అనేక ఆరోపణలు, విమర్శలు వచ్చేవి. ముఖ్యంగా హన్సిక చిన్న వయసులోనే పెద్దగా కనిపించేందుకు ఆమె తల్లి హార్మోన్ లకు సంబంధించిన ఇంజక్షన్ ఇచ్చిందనే ఆరోపణలు ఎదుర్కొంది. ఆ విషయమై హన్సిక గతంలో పలు సార్లు స్పందించింది. ఆ విమర్శలు నా హృదయాన్ని విచ్ఛిన్నం చేశాయని, అమ్మను విమర్శిస్తూ ఉంటే తట్టుకోలేక పోయేదాన్ని అంటూ హన్సిక పేర్కొంది. చిన్న వయసులో పెద్ద అమ్మాయిలుగా కనిపించేందుకు కొందరు హార్మోన్ ఇంజక్షన్ లు ఇవ్వడం జరుగుతుంది. హన్సిక కి కూడా అలాంటి ఇంజక్షన్స్ ను స్వయంగా తల్లి ఇచ్చింది అంటూ అప్పట్లో చాలా మంది కామెంట్స్ చేశారు. కానీ ఏ తల్లి కూడా తన కూతురుకు సినిమాల ఆఫర్ల కోసం అలాంటి పని చేయదు. సినిమా ఇండస్ట్రీలో ఉన్న వారిపై కొందరు ఇలాంటి విమర్శలు చేయడం సర్వసాధారణ విషయం.

## ఇది కదా సాయి పల్లవి ఫ్యాన్స్ కోరుకున్నది..!

ప్రేమమ్ సినిమా తో ఇండస్ట్రీలో అడుగు పెట్టి మొదటి సినిమాతోనే సౌత్ స్టార్ హీరోయిన్ గా మారి పోయిన ముద్దుగుమ్మ సాయి పల్లవి. తెలుగు లో ఫిదా సినిమాతో ఫిదా చేసి టాలీవుడ్ టాప్ హీరోయిన్స్ జాబితాలో చేరడం మాత్రమే కాకుండా భారీ పారితోషికం కూడా అందుకున్న ఘనత దక్కించుకుంది. ఏడాదికి అయిదు ఆరు సినిమాలు చేసేంత క్రేజ్ ని, ఇమేజ్ ను సొంతం చేసుకున్న ముద్దుగుమ్మ సాయి పల్లవి అనూహ్యంగా 2023 సంవత్సరంలో ఒక్క సినిమాని కూడా చేయలేదు. ఈ ఏడాది ఆమె నుంచి ఒక్క సినిమా కూడా రాలేదు. గత ఏడాది వచ్చిన విరాట పర్వం తర్వాత ఆమె కనిపించలేదు. ఏడాది కాలం పాటు ఆమె ఎలాంటి సినిమాలకు ఓకే చెప్పక పోవడంతో ఆమె సినిమా ఇండస్ట్రీకి దూరంగా ఉండాలని భావిస్తుందా అనే అనుమానాలు కూడా వ్యక్తం అయ్యాయి. భారీ పారితోషికాలతో ఆఫర్



చేసినా కూడా సాయి పల్లవి పలువురు స్టార్ హీరోల సినిమాలకు నో చెబుతూ వచ్చింది. ఎట్టకేలకు సాయి పల్లవి సినిమాలకు ఓకే చెబుతోంది. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా సాయి పల్లవి నాలుగు సినిమాలకు ఓకే చెప్పింది. అందులో కొన్ని సినిమాల షూటింగ్స్ కూడా ప్రారంభం అయ్యాయి. తమిళ్ లో ఒక సినిమాను చేస్తున్న సాయి పల్లవి తెలుగు లో చైతూ కు జోడీగా తండేల్ సినిమాను చేస్తున్న విషయం తెల్సిందే. తాజాగా మలయాళంలో నివిన్ పౌలీ తో ఒక సినిమాను చేసేందుకు ఓకే చెప్పింది. వీరిద్దరి కాంబోలో ప్రేమమ్ వచ్చి మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఇన్నేళ్ల తర్వాత సాయి పల్లవి అతడితో సినిమాకు రెడీ అయ్యింది. ఇక అందరి దృష్టిని ఆకర్షిస్తోన్న యశ్ 19 సినిమాలో కూడా సాయి పల్లవి హీరోయిన్ అనే వార్తలు వస్తున్నాయి. మొత్తానికి సాయి పల్లవి అభిమానులు ఏమైతే కోరుకుంటున్నారో అదే జరుగుతోంది. ఆమె వరుసగా సినిమాలు చేయాలని, ఆ సినిమాలు పాన్ ఇండియా రేంజ్ లో విడుదల అవ్వాలని ఆశిస్తున్నారు. సాయి పల్లవి అన్ని భాషల్లో కూడా సినిమాలు చేస్తూ ఫ్యాన్స్ కి సంతోషాన్ని కలిగిస్తోంది.




హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో ప్రొటెం స్పీకర్‌గా ఎంఐఎంకు చెందిన చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ ప్రమాణం చేయించారు. ముందుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తర్వాత ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆ తర్వాత వరుసగా మంత్రులు ప్రమాణం చేశారు. ఆ తర్వాత ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ సీఎం కేసీఆర్‌కు సర్జరీ దృష్ట్యా ప్రమాణ స్వీకారానికి కేటీఆర్ రాలేదు. ప్రమాణ స్వీకారానికి తనకు మరో రోజు సమయం ఇవ్వాలని శాసనసభ సెక్రటరీని ఆయన కోరారు. మరోవైపు, శాసనసభ సమావేశాలకు భాజపా ఎమ్మెల్యేలు గైర్హాజరు అయ్యారు. సీనియర్ ఎమ్మెల్యేలను కాదని ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్‌ను చేశారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. ప్రొటెం స్పీకర్ సమక్షంలో భాజపా ఎమ్మెల్యేలు ఇవాళ ప్రమాణం చేయరని తేల్చిచెప్పారు. రెగ్యులర్ స్పీకర్ ఎన్నిక తరువాతే భాజపా ఎమ్మెల్యేలు ప్రమాణం చేస్తారన్నారు.




## ఎమ్మెల్సీలుగా పల్లా, కడియం శ్రీహరి, పాడి కౌశిక్ రెడ్డి రాజీనామా

హైదరాబాద్: ఎమ్మెల్సీలుగా పల్లా రాజేశ్వర్ రెడ్డి, కడియం శ్రీహరి, పాడి కౌశిక్ రెడ్డి రాజీనామా చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వీరు వరుసగా జనగామ, స్టేషన్ ఘన్‌పూర్, హుజూరాబాద్ నుంచి ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. నిబంధనల ప్రకారం 15 రోజులలోపు ఏదో ఒక సభ్యత్వానికి రాజీనామా చేయాలి. ఖాళీ అయిన స్థానానికి ఎన్నికల కమిషన్ ఆరు మాసాలలోపు ఎన్నికలు నిర్వహిస్తుంది. ఈ నేపథ్యంలో శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని కలిసి ఎమ్మెల్సీలుగా రాజీనామా చేస్తున్నట్లు లేఖలు అందజేశారు. వీరి రాజీనామాలను మండలి ఛైర్మన్ ఆమోదించారు. కడియం శ్రీహరి, పాడి కౌశిక్ రెడ్డి 2021లో జరిగిన శాసనమండలి ఎన్నికల్లో ఎమ్మెల్యే కోటాలో భారాస ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ఖరారయ్యారు. వీరికి 2027 నవంబరు వరకు పదవీకాలం ఉంది. డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి 2015లో తెరాస తరఫున నల్లగొండ, వరంగల్, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి గెలుపొందారు. ఇక 2021లోనూ ఇదే నియోజకవర్గం నుంచి రెండోసారి శాసనమండలి సభ్యుడిగా విజయం సాధించారు. రాజేశ్వర్‌రెడ్డికి ఎమ్మెల్సీ పదవీ కాలం 2027 వరకు ఉంది.

## బర్రెలక్క కంటే తక్కువ ఓట్లు.. పొత్తుల తప్పు.. తమ్మినేని పదవికి ముప్పు?

వామపక్షాలు అంటే సిద్ధాంతబద్ధమైన పార్టీలు. అన్ని పార్టీలకూ సిద్ధాంతాలు ఉన్నప్పటికీ, వామపక్షాల సంగతి వేరు. జాతీయ స్థాయిలోనూ పదవులకు ఆశపడని చరిత్ర వారి సొంతం. అలాంటి పార్టీలు క్రమంగా ప్రజలకు దూరమవుతున్నాయనే భావన వ్యక్తమవుతోంది. చట్ట సభల్లో అవి కోల్పోతున్న ప్రాధాన్యమే దీనికి నిదర్శనంగా చూపుతున్నారు. ఇక తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే.. ఏపీలో రెండుసార్లుగా ప్రాతినిధ్యమే లేదు. తెలంగాణలో గత ఎన్నికల్లోనూ వారికిదే పరిస్థితి ఎదురైంది. తాజా ఎన్నికల్లో సీపీఐ తరఫున ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు గెలుపొంది అసెంబ్లీలో రెండోసారి అడుగు పెడుతున్నారు.

**సీపీఐ సరే.. సీపీఎం సంగతేంటి..? :** కాంగ్రెస్ తో ఎలాగోలా బేరమాడి కొత్తగూడెం సీటును దక్కించుకుని గెలిచింది సీపీఐ. అదే ఇప్పుడు ఆ పార్టీకి పెద్ద బలంగా మిగిలింది. వాస్తవానికి ఇక్కడ సీపీఐకి సీటు పరిస్థితుల కారణంగానే వచ్చింది. కొత్తగూడెంలో కాంగ్రెస్ కు ఎడవల్లి క్రిష్ణ రూపంలో నాయకుడు ఉన్నప్పటికీ.. కూనంనేని అనుభవం ఆయనకు కలిసొచ్చింది. మరే పెద్ద నాయకుడూ ఇక్కడ పోటీ పడకపోవడం సీపీఐకి ఈ స్థానాన్ని కేటాయించేలా చేసిది. ఈ క్రమంలో మునుగోడు డిమాండ్ ను వదులుకుంది సీపీఐ. కానీ, సీపీఎంకు మాత్రం అలాకాదు. ఆ పార్టీ పాలేరు, మిర్యాలగూడ తదితర స్థానాలను కోరుకుంది. కాంగ్రెస్ తరఫున తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభ్యర్థిత్వాలు పరిశీలనలో ఉన్న సీటు అది. కానీ, పాలేరునే పట్టుబట్టిం సీపీఎం. చివరకు కాంగ్రెస్ ఆ స్థానం ఇవ్వలేదు.

**పొత్తు సర్దుకుపోవాల్సింది..** సీపీఐ తరహాలోనే కాస్త పట్టువిడిచి పాలేరును వదులుకుని కాంగ్రెస్ తో సీపీఎం సర్దుకుపోవాల్సింది. కానీ, పాలేరు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సొంత నియోజకవర్గం. అక్కడ నేరుగా ఆయనే పోటీ చేయాలనుకున్నారు. దీంతో పాలేరు కోసం గట్టిగా పట్టుబట్టారు. వాస్తవానికి వామపక్షాల రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయరు. దీన్ని పక్కనపెట్టి ఓవైపు కూనంనేని, మరోవైపు తమ్మినేని పోటీకి సిద్ధపడ్డారు. ఇక పాలేరుపై పంతానికి పోయిన తమ్మినేని.. కాంగ్రెస్ తో పొత్తు కుదరకుండా చేశారనే విమర్శలు, ఆరోపణలు వచ్చాయి. ఇందులో వాస్తవం తక్కువే. ఎందుకంటే.. పాలేరులో కాంగ్రెస్ టికెట్ కు తుమ్మల, పొంగులేటి వంటివారు పోటీ పడ్డారు.

దీంతోనే ఆ పార్టీ ఈ స్థానాన్ని ఇవ్వలేదు. అయితే, రాష్ట్రంలో మరెక్కడైనా కనీసం ఒక సీటైనా ఇచ్చేలా కాంగ్రెస్ తో సయోధ్య కుదుర్చుకుంటే తమ్మినేనికి ఇబ్బంది లేకుండా ఉండేది.



**ప్రజాదరణ లేక కాదు.. పొందలేక :** తమ్మినేని పాలేరులో పోటీ చేయకుండా ఉన్నా బాగుండేమో..? ఎన్నో ప్రజా ఉద్యమాలు, పాదయాత్రలు చేసిన ఆయన కేవలం 5,308 ఓట్లు పొందడానిన చూస్తే ఇదే అనిపిస్తుంది. సామాన్య యువతి బర్రెలక్క అలియాస్ కర్నె శిరీష కంటే తమ్మినేనికి 446 ఓట్లు తక్కువగా వచ్చాయి. తమ్మినేనికి 5,308 ఓట్లు రాగా.. డిపాజిట్ దక్కలేదు. మహబూబ్ నగర్ జిల్లా కొల్లాపూర్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన బర్రెలక్కకు 5,754 ఓట్లు వచ్చాయి. ఇక దాదాపు రెండేళ్ల కిందట తమ్మినేని స్వగ్రామం తెల్దారుపల్లిలో ఆయన సమీప బంధువు, బీఆర్ఎస్ నాయకుడు తమ్మినేని కిష్టయ్య దారుణ హత్యకు గురయ్యారు. ఈ విషయంలో సీపీఎం నాయకత్వంపైనే ఆరోపణలు వచ్చాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా చర్యలు తీసుకోలేదనే విమర్శలు వచ్చాయి. తెల్దారుపల్లిలో మొత్తం 3,325 ఓట్లుండగా 3,150 పోలయ్యాయి. కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి 2,030ఓట్లు, తమ్మినేని వీరభద్రానికి 665 ఓట్లు పడ్డాయి. బీఆర్ఎస్ అభ్యర్థి కందాల ఉపేందర్‌రెడ్డికి 246 ఓట్లు వచ్చాయి. సీపీఎం తప్ప మరే పార్టీ పేరు వినిపించని గ్రామంగా తెల్దారుపల్లిని చెబుతారు. అలాంటిచోటనే తమ్మినేనికి వెయ్యి ఓట్లు కూడా రాలేదు.

**రాష్ట్ర కార్యదర్శిగా ఉంటారా?** తెలంగాణ ఏర్పాటు నుంచి సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా తమ్మినేని వీరభద్రమే కొనసాగుతున్నారు. పార్టీ పరంగా, వ్యక్తిగతంగా తాజా పరాజయం ఆయనకు ఇబ్బందికరమే. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర కార్యదర్శి పదవి నుంచి తమ్మినేని తప్పుకొంటారా? లేక పార్టీనే తప్పుకోమని కోరుతుందా? అనేది చూడాలి.




హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పలు మార్పులు వేగంగా చోటుచేసుకుంటున్నాయి. కేసీఆర్ ప్రభుత్వంలో ప్రభుత్వ సలహాదారులుగా ఉన్న ఏడుగురిని రేవంత్ ప్రభుత్వం తొలగించింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. వీరితో పాటు స్పెషల్ ఆఫీసర్లను కూడా రేవంత్ ప్రభుత్వం తొలగిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

**రేవంత్ ప్రభుత్వం తొలగించింది వీరినే...** 1. సీఎం ముఖ్య సలహాదారు సోమేశ్ కుమార్ 2. ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ 3.సాంస్కృతిక, దేవాదాయ సలహాదారు కేవీ రమణాచారి(రీసెంట్ రిజైన్) 4.ప్రభుత్వ ప్రధాన సలహాదారు చెన్నమనేని రమేష్ 5. హోంశాఖ సలహాదారు అనురాగ్ శర్మ 6.ముస్లిం మైనారిటీ సంక్షేమ సలహాదారు ఏకే ఖాన్ 7. అటవీ సంరక్షణ శాఖ ముఖ్య సలహాదారు శోభ

**స్పెషల్ ఆఫీసర్ హోదాలో ఉన్నవారు వీరే..** 1.ఇరిగేషన్ అడ్వైజర్ ఎస్కే జోషి 2. ఫైనాన్స్ డిపార్టుమెంట్ స్పెషల్ ఆఫీసర్లు జీఆర్‌రెడ్డి, శివశంకర్ 3. ఆర్ అండ్ బీ శాఖ స్పెషల్ ఆఫీసర్లు సుధాకర్ తేజ 4.ఇంధన సెక్టార్ స్పెషల్ ఆఫీసర్లు రాజేంద్ర ప్రసాద్ సింగ్ 5. ఉద్యాన శాఖ అడ్వైజర్ శ్రీనివాస్‌రావు

గత ప్రభుత్వ సలహాదారులతో పాటు స్పెషల్ ఆఫీసర్ హోదాలో ఉన్న అధికారుల నియామకాలను రద్దు చేస్తూ సీఎస్ తాజాగా ఉత్తర్వులు జారీచేయడంతో వీరంతా ఇప్పుడు ఇంటిదారి పట్టనున్నారు. వీరి స్థానంలో ప్రొఫెసర్ కోదండరామ్, మరి కొంత మంది అధికారులను ప్రభుత్వ ప్రధాన సలహాదారుగా నియమించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.



## సోనియా గాంధీ జన్మదిన వేడుకలు.. 78 కిలోల కేక్‌ను కట్ చేసిన సీఎం రేవంత్

హైదరాబాద్: కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ జన్మదినం రోజే గతంలో తెలంగాణ ప్రకటన వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారని చెప్పారు. సోనియా గాంధీ 78వ పుట్టిన రోజు వేడుకలను గాంధీభవన్‌లో ఘనంగా నిర్వహించారు. పీసీసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సీఎం, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. 78 కిలోల కేక్‌ను పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావుతో రేవంత్ కట్ చేయించారు. 6 గ్యారంటీ హామీల్లో రెండింటిని సోనియా పుట్టిన రోజు నుంచి ప్రారంభించాలని నిర్ణయించడం సంతోషకరమన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలతో త్యాగం, కష్టంతోనే అధికారంలోకి వచ్చామని, వారి ఆశీస్సులతో తొలిసారి అసెంబ్లీకి వెళ్తున్నామని చెప్పారు.

**ప్రధాని మోదీ శుభాకాంక్షలు..** సోనియా గాంధీ పుట్టినరోజు సందర్భంగా ఆమెకు ప్రధాని నరేంద్రమోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆమె నిండు నూరేళ్లు, ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థించారు.

## భారాస శాసనసభా పక్ష నేతగా కేసీఆర్ ఎన్నిక



హైదరాబాద్: భారాస శాసనసభా పక్ష నేతగా ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎన్నుకున్నారు. కేశవరావు అధ్యక్షతన కొత్తగా ఎన్నికైన భారాస ఎమ్మెల్యేలు ఇవాళ తెలంగాణ భవన్‌లో సమావేశమై ఈ మేరకు తీర్మానం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో 39 స్థానాలను గెలుచుకొని భారాస ప్రతిపక్ష హోదాలో నిలిచిన సంగతి తెలిసిందే. పార్టీ అధినేత కేసీఆర్‌కు శస్త్రచికిత్స జరిగిన కారణంగా శనివారం నాటి సమావేశానికి హాజరు కావడం లేదని పార్టీ వర్గాలు తెలిపాయి. మిగిలిన ఎమ్మెల్యేలు పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. కేసీఆర్‌ను తమ పార్టీ శాసనసభా పక్ష నేతగా ఎన్నుకుంటూ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఆమోదించారు. అనంతరం ఎమ్మెల్యేలందరూ అసెంబ్లీకి బయలుదేరి వెళ్లారు. ఆస్పత్రిలో ఉన్నందున బీఆర్ఎస్ఎల్పీ భేటీకి కేటీఆర్ హాజరుకాలేదు. వ్యక్తిగత కారణాలతో ఎమ్మెల్యేలు పద్మారావు, ముఠా గోపాల్ కూడా సమావేశానికి రాలేదు.

## అసెంబ్లీ సమావేశాలు వాయిదా.. స్పీకర్ ఎన్నిక అప్పుడే




హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 14కు వాయిదా పడ్డాయి. పునఃప్రారంభమైన తొలిరోజున శాసన సభాపతిని ఎన్నుకుంటారు. ఆ మరుసటి రోజు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ తమిళిసై ప్రసంగిస్తారు. తర్వాతి రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ప్రవేశపెట్టి చర్చిస్తారు. ఆ తర్వాత ఎన్ని రోజులు సభ నిర్వహించాలనేది స్పీకర్ ఎన్నిక అనంతరం జరిగే బీఏసీలో నిర్ణయిస్తారు. శనివారం ఉదయం 11 గంటలకు శాసనసభ సమావేశాలు ప్రారంభం కాగా.. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో ప్రొటెం స్పీకర్‌గా ఎంఐఎంకు చెందిన చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ ప్రమాణం చేయించారు. ముందుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తర్వాత ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆ తర్వాత వరుసగా మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రమాణం చేశారు. మాజీ సీఎం కేసీఆర్‌కు సర్జరీ దృష్ట్యా ప్రమాణ స్వీకారానికి కేటీఆర్ రాలేదు. ప్రమాణ స్వీకారానికి తనకు మరో రోజు సమయం ఇవ్వాలని శాసనసభ సెక్రటరీని ఆయన కోరారు.

## ఆరోగ్యశ్రీ, మహాలక్ష్మి, చేయూత పథకాలను ప్రారంభించిన రేవంత్



హైదరాబాద్ : మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని సీఎం రేవంత్, మంత్రులు, ప్రొటెం స్పీకర్ ప్రారంభించారు. శాసన సభ ఆవరణలో మహాలక్ష్మి, చేయూత పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. మహిళలు రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ నుంచి ఎక్కడకి అయినా బస్సుల్లో ఇక నుంచి ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీలలో ఉచితం. అసెంబ్లీ ఆవరణలో మూడు బస్‌లను ప్రారంభించారు. ఆరోగ్య శ్రీ పథకాన్ని సైతం సీఎం రేవంత్ ప్రారంభించారు. వరల్డ్ ఛాంపియన్, కామన్వెల్త్ గోల్డ్ మెడలిస్ట్, బాక్సర్ నిఖత్ జరీన్‌కు పారిస్ ఒలింపిక్స్ సన్నద్ధత కోసం రూ.2 కోట్ల చెక్‌ను రేవంత్ అందించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. ఈరోజు తెలంగాణ ప్రజలకు పండగరోజన్నారు. 2009, డిసెంబర్ 9న తెలంగాణ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. తెలంగాణ తల్లి అంటే సోనియమ్మ రూపం కనిపిస్తుందన్నారు. తనది తెలంగాణ అని చెప్పుకునే అవకాశం మనకు సోనియమ్మ ఇచ్చారని రేవంత్ కొనియాడారు. తెలంగాణ ప్రజల కోసం సోనియమ్మ ఆరు గ్యారంటీలను ఇచ్చారన్నారు. ఇవాళ ఆరు గ్యారంటీలలో రెండు గ్యారంటీలను అమలు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుందన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10లక్షల వరకు ప్రజలకు ఉచిత వైద్యం అందిస్తామన్నారు. మహిళలు ఈరోజు నుంచి రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణించవచ్చన్నారు. ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణను సంక్షేమ రాజ్యంగా మారుస్తామని రేవంత్ తెలిపారు.

## ఎన్ని విమర్శలు వచ్చినా బీజేపీకి 8 సీట్లు కట్టబెట్టారు

హైదరాబాద్: ఎన్ని విమర్శలు వచ్చినా, తప్పుడు ప్రచారం చేసినా బీజేపీకి ప్రజలు ఎనిమిది సీట్లు కట్టబెట్టారని ఆ పార్టీ నేత ఈటల రాజేందర్ అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీకీ ఓట్లు సీట్లు పెంచేందుకు కృషి చేసిన బీజేపీ కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజలు తమపై నమ్మకాన్ని విశ్వాసాన్ని పెంచుకున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో గతంలో నాలుగు స్థానాలు గెలిపించారని.. తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ స్వీప్ చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీనే అని నిరూపించారన్నారు. మోడీ గత తొమ్మిది సంవత్సరాల పాటు భద్రత, భరోసానే కాదు ప్రపంచవ్యాప్తంగా దేశ గొప్పతనాన్ని చాటిన వ్యక్తి అని కొనియాడారు. కరోనాను తట్టుకుని ఆర్థిక పురోగతి సాధిస్తున్న దేశం భారత్ దేశం అని చెప్పుకొచ్చారు. భారతదేశం చుట్టూ ఉన్న దేశాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని.. వాటిని ఆదుకున్న వ్యక్తి ప్రధాని మోడీ అని అన్నారు. మోడీ వచ్చిన తర్వాత కాశ్మీర్ వంటి ప్రాంతాల్లో కాల్పులు తగ్గిపోయాయన్నారు. భారతదేశం బార్డర్‌లో ఇంచు స్థలం కూడా కబ్జా కాకుండా జెండాలు పాతిన వ్యక్తి మోడీ అని కొనియాడారు. రాజస్థాన్, మధ్య ప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్‌లలో బీజేపీ సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ విజయాన్ని ఆస్వాదిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నేతలు మిగతా రాష్ట్రాలలో ఈవీఎంలు ట్యాంపర్ అవుతున్నాయని ఆరోపిస్తున్నారన్నారు. రేపు పార్లమెంట్‌లో 400 స్థానాలు గెలవడమే లక్ష్యంగా మోడీ పని చేస్తున్నారని తెలిపారు. అయోధ్యలో అందరినీ ఒప్పించి రామాలయం కట్టిస్తున్న వ్యక్తి మోడీ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మోడీకే ఓటేస్తామని ప్రజలు చెబుతున్నారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పూర్తిగా కేంద్ర ప్రభుత్వం నిధులతో చేస్తున్నవే అని చెప్పుకొచ్చారు. పేదలకు సొంతింటి కళ నెరవేర్చే బాధ్యత కేంద్ర ప్రభుత్వం తీసుకుంటుందని ఈటల రాజేందర్ వెల్లడించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com